www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
09.02.2024
సంపుటి:2 సంచిక:115

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## యూపీఏ పాలనలో ఆర్థిక వ్యవస్థ దిగజారింది

- ఎన్డీఏ సర్కార్ ఎన్నో సవాళ్లను అధిగమించింది
- పదేళ్ల పాలనలో లోపాల నుంచి పాఠాలు
- భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోని సంక్షోభాలను అధిగమిస్తూ దేశ ఆర్థిక రంగాన్ని గాడినపెట్టామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రాన్ని ఆర్థికమంత్రి లోక్సభలో ప్రవేశపెట్టారు. 2004 నుంచి 2014 వరకు సాగిన యూపీఏ పాలనలో ఆర్థిక దుర్వినియోగం జరిగిందని తెలిపారు. ఆ పదేళ్ల పాలనలోని సంక్షోభాలను అధిగమించి దేశ ఆర్థిక వ్యవస్థ సర్వతోముఖాభివృద్ధి, స్థిరమైన వృద్ధి చెందే సంస్కరణలను తీసుకొచ్చామని వివరించారు. 2014లో మన ఆర్థిక వ్యవస్థ ఎక్కడుందో, ఇప్పుడు ఎక్కడ ఉందో చూడాలని నిర్మలా సీతారామన్ అన్నారు. ఆ పదేళ్ల పాలనలోని లోపాల నుంచి పాఠాలు నేర్చుకుని ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేశామని తెలిపారు. తాము విడుదల చేసిన శ్వేతపత్రం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతుందని చెప్పారు. రాజకీయ, విధాన స్థిరత్వంతో ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాల కోసం కఠినమైన, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని వివరించారు. పదేళ్ల పాలనలో యూపీఏ ప్రభుత్వం విడిచిపెట్టిన సవాళ్లను ఎన్డీఏ ప్రభుత్వం విజయవంతంగా అధిగమించిందని అన్నారు.





# ఇది ప్రజా ప్రభుత్వం

## ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా పాలన

- ఇనుప కంచెలు విరిచి ప్రజాభవన్ తెరిచినం
- ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు చెప్పుకుంటున్నరు..
- 'ఆరు గ్యారంటీ'ల అమలుకు కట్టుబడి ఉన్నం..
- రెండు నెరవేర్చినం.. మరో రెండు త్వరలో అమలు చేస్తం
- గత ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసింది..
- ప్రజలపై భారం మోపకుండా కోలుకునేలా చేస్తున్నం
- ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలు అందిస్తాం
- వెయ్యికరాల్లో 10-12 ఫార్మా విలేజ్ లు
- త్వరలో యువతకు 2 లక్షల ఉద్యోగాలు
- ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన గవర్నర్ తమిళిసై

**విశాల భారతి, స్టేట్బ్యూరో:**

'తెలంగాణ సర్కార్ ప్రజల ఆకాంక్షకు తగినట్లుగా రాష్ట్రంలో పాలన సాగిస్తోందని, ఇది ప్రజా ప్రభుత్వం' అని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. గురువారం తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం ఉందన్నారు. ప్రజల సర్కారు కొలువుదీరగానే ప్రగతి భవన్ కంచెలు తొలగించి జ్యోతిరావు పూలే ప్రజాభవన్ గా మార్చిందని గవర్నర్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా సామాన్యులు నేరుగా ప్రజాభవన్ కు వచ్చి సమస్యలు చెప్పుకొనే పరిస్థితి కల్పించామని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని గవర్నర్ ఉద్ఘాటించారు. ఇప్పటికే రెండింటిని అమలు చేశామని, మరో

..మిగతా 2 లో

### 2 లక్షల కొలువుల భర్తీపై ఫోకస్

టీఎస్పీఎస్సీ ద్వారా 2 లక్షల ఉద్యోగాల భర్తీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేస్తున్నామని, ఉద్యోగాలను వీలైంత త్వరగా భర్తీ చేస్తామని గవర్నర్ అన్నారు. ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత ఆకాంక్షలు నెరవేర్చబోతోందని భరోసా ఇచ్చారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడంపై ఫోకస్ పెట్టామని అన్నారు. త్వరలో కులగణన చేపట్టబోతున్నామని వివరించారు. పెద్దఎత్తున మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపడతామని.. ఆ నది మరోసారి హైదరాబాద్ జీవనాడిగా మారుతుందని చెప్పారు.

# ఇదో ప్రసంగమా?

- జనానికి ఏమిచ్చారు?
- రైతు బంధు ఇస్తున్నారా?
- పింఛన్లు సకాలంలో ఇచ్చారా? : హరీశ్ రావు ఫైర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత కేసీఆర్ కు బదులు హరీశ్ రావు హాజరయ్యారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్...శాసనసభా వ్యవహారాల మంత్రికి సమాచారం కూడా ఇచ్చారు. అయితే బీఏసీ సమావేశానికి హరీశ్ రావు రావడాన్ని అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తప్పుపట్టారు. కేసీఆర్ కు బదులు హరీశ్ రావు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో హరీశ్ రావు సమావేశంలో పాల్గొనకుండానే బయటకు వచ్చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఫ్యూటీ సీఎం

..మిగతా 2 లో

# ఎన్ఐఏ సోదాల కలకలం..

- హైదరాబాద్లో మూడు చోట్ల ఎన్ఐఏ దాడులు
- వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ ఇంట్లో తనిఖీలు
- ఇటీవల మావోయిస్టు సెంట్రల్ కమిటీ నేత దీపక్రావు అరెస్ట్
- ఆయన సమాచారంతోనే ఎన్ఐఏ సోదాలు
- తనకు విరసంతో సంబంధం లేదన్న వేణుగోపాల్




**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

ఎక్కడో తీగ లాగితే.. హైదరాబాద్లో డొంక కదిలింది. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు ఇచ్చిన సమాచారంతో ఏక కాలంలో మూడు చోట్ల ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. హిమాయత్ నగర్, నారాయణగూడ, ఎల్బీ నగర్లలో గురువారం ఎన్ఐఏ తనిఖీలు కలకలం రేపాయి. విప్లవ రచయితల సంఘం నేత వరవరరావు మేనల్లుడు, 'వీక్షణం' పత్రిక ఎడిటర్ వేణుగోపాల్తో పాటు రవి శర్మ అనే మరో వ్యక్తి ఇంట్లో ఎన్ఐఏ అధికారులు ఐదు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు.దేశంలో మావోయిస్టుల ప్రాబల్యాన్ని రూపు మాపాలనే

..మిగతా 2 లో

# ఇసుక అమ్మకాలకు కొత్త పాలసీ



- అక్రమ ఇసుక రవాణాపై సీఎం రేవంత్ ఆగ్రహం
- ప్రస్తుత పద్ధతి అవినీతికి కేరాఫ్గా మారింది..
- 25శాతం శాండ్ అక్రమంగా తరలిపోతోంది..
- 48 గంటల్లో తీరు మార్చుకోవాలని ఆఫీసర్లకు వార్నింగ్
- అన్ని జిల్లాల్లో విజిలెన్స్, ఏసీబీ తనిఖీలు చేయండి
- అక్రమార్కులను ఎవరినీ వదలొద్దని సీఎం ఆదేశం

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఇసుక అమ్మకాలకు కొత్తపాలసీ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తమిళనాడు, కర్ణాటక, ఏపీ తదితర రాష్ట్రాల విధానాలపై స్టడీ చేయాలని సూచించారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చటంతో పాటుగా ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండే విధివిధానాలు ఉండేలా కొత్త పాలసీ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

గురువారం సెక్రటేరియట్లో గనులు, భూగర్భ ఖనిజ వనరుల శాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమల్లో ఉన్న ఇసుక పాలసీ అవినీతి దందాగా మారిందని సీఎం అభిప్రాయపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించి జరుగుతున్న ఇసుక క్వారీయింగ్, అక్రమ ఇసుక రవాణాను వెంటనే అరికట్టాలని హెచ్చరించారు. 48 గంటల్లో అన్ని స్థాయిల్లో అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలని వార్నింగ్ఇస్తూ డెడ్లైన్ విధించారు. బాధ్యులైన ఎవరిని వదిలిపెట్టొద్దని ఉన్నతాధికారులను ఆదేశించారు. రెండు రోజుల తర్వాత విజిలెన్స్, ఏసీబీ విభాగాలను రంగంలోకి దింపాలని, అన్ని జిల్లాల్లో వెంటనే తనిఖీలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

అన్ని రూట్లలో ఉన్న టోల్ గేట్ల వద్ద నమోదైన డేటా ఆధారంగా ఇసుక లారీల అక్రమ రవాణా మొత్తం బయటకు తీయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడున్న ఇసుక రీచ్లు, డంప్లన్నీ తనిఖీలు చేయాలని, తప్పులుంటే

..మిగతా 2 లో



# గ్రేటర్ హైదరాబాద్లో బీఆర్ఎస్కు భారీ షాక్

- పార్టీ వీడిన మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్
- బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్కు రాజీనామా లేఖ
- స్టేట్ కాంగ్రెస్ ఇన్చార్జి దీపా మున్షీ సమక్షంలో పార్టీలో చేరిక

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:** డిసెంబర్లో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి షాక్ల మీద షాక్లు తగులుతున్నాయి. ఇటీవల కాలంలో పలువురు బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా

..మిగతా 2 లో



# కాంగ్రెస్లోకి 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!

- పైసలు లేకనే సంగారెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన..
- హైకమాండ్ ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా..
- కాంగ్రెస్సీనియర్నేత జగ్గారెడ్డి కామెంట్స్

**విశాల భారతి, స్టేట్బ్యూరో:**

త్వరలో కాంగ్రెస్లోకి 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వస్తారంటూ ఆ పార్టీ స్టేట్వైస్ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కన ఉన్నా కూడా ఆ 20 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారడం పక్కా అన్నారు. ప్రజలకు బాగా సేవ చేయాలని, వారిలో మంచి పేరు తెచ్చుకునేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ వైపు అట్రాక్ట్ అవుతారని కాన్ఫిడెంట్ గా చెబుతున్నానని వ్యాఖ్యానించారు. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వస్తారంటూ గతంలోనూ జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు మరోసారి అదే రకమైన కామెంట్స్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. కాగా తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ నేతలను ఎన్నో ఇబ్బందులు పెట్టిందని జగ్గా రెడ్డి అన్నారు. పోలీసుల్ని అడ్డం

..మిగతా 2 లో



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన.. పట్నం మహేందర్రెడ్డి దంపతులు

- త్వరలో కాంగ్రెస్ లో చేరే అవకాశం!
- త్వరలోనే బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్తారని టాక్..

**విశాల భారతి, స్టేట్బ్యూరో:**

తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ కు గట్టి షాక్ తగిలింది. అధికారం కోల్పోవడంతో పట్టు కోల్పోతున్న గులాబీ దళంలో ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. అధికార కాంగ్రెస్ లోకి చేరిపోతున్నారు. తాజాగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి తో పాటు వికారాబాద్ జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి గురువారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. సీఎంతో

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
www.vishalabharati.com
epaper:vishalabharati.com
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily


# ఎన్ఐఏ సోదాల కలకలం..

మొదటిపేజీ తరువాయి

కృత నిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని 'రెడ్ కారిడార్'పై యుద్ధం ప్రకటించింది. దండకారణ్యంతో పాటు దాని చుట్టుపక్కల ఉన్న మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఏవోబీలలోని మావోయిస్టుల స్థావరాలపై భద్రతా బలగాలు భారీ ఎత్తున దాడులు జరుపుతున్నాయి. కూంబింగ్‌సాగిస్తున్నాయి. సరిగా ఇదే నేపథ్యంలో ఇండియాలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుల్లో ఒకరైన దీపక్ రావును కొద్ది నెలల కింద పోలీసులు అరెస్ట్ చేశారు.

మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు దీపక్ రావు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. హిమాయత్ నగర్, నారాయణగూడ, ఎల్బీ నగర్ ఇలా మొత్తం మూడు చోట్ల ఏకకాలంలో ఎన్ఐఏ అధికారులు దాడులు చేశారు. ఈ సోదాల్లో విరసం నేత వరవరరావు మేనల్లుడు, వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్‌ని ఎన్ఐఏ అధికారులు టార్గెట్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని వేణుగోపాల్ నివాసంలో తెల్లవారుజామునే సోదాలు చేపట్టిన అధికారులు.. దాదాపు ఐదు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. వేణు సెల్‌ఫోన్‌ను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక ఎల్బీ నగర్‌లోని రవి శర్మ నివాసంలోనూ ఎన్ఐఏ సోదాలు జరిగాయి. రవి శర్మ, సెల్‌ఫోన్, బుక్‌లెట్, కరపత్రాలను ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న నేపథ్యంలోనే ఎన్ఐఏ ఈ సోదాలు నిర్వహించిందని సమాచారం.

అయితే దీపక్ రావుతో తనకు ఎటువంటి సంబంధం లేదని వేణుగోపాల్‌చెప్పారు. దీపక్‌రావుని అరెస్ట్ చేయగానే ఎఫ్ఐఆర్ లో తన పేరు పెట్టి, విరసం సభ్యుడు అని పేర్కొన్నారని వేణు అన్నారు. అయితే 15 ఏండ్ల కిందనే తాను 'విరసం' నుంచి బయటకు వచ్చానని వేణు చెప్పారు. ఈ కేసును పోలీసుల నుంచి ఎన్ఐఏ టేక్‌ఓవర్ చేసిందని, అప్పటినుంచి దాడులు మొదలయ్యాయన్నారు. పోలీసులకు దీపక్‌రావు ఇచ్చిన కన్‌ఫెషన్ వల్లనే తనపై కేసు పెట్టారని, అయితే అది చెల్లదు అన్నారు. ఇది తప్పుడు కన్‌ఫెషన్ అని ఆయన ఆరోపించారు.

# ఇసుక అమ్మకాలకు కొత్త పాలసీ

మొదటిపేజీ తరువాయి

జరిమానాలు వేస్తే సరిపోదని, అంతకు మించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇసుక రీచ్‌లన్నింటా సీసీ కెమెరాలున్నాయని అధికారులు ఇచ్చిన సమాధానంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది మార్చి ఒకటో తేదీన కరీంనగర్ జిల్లా జమ్మికుంట పాదయాత్రకు వెళ్లినప్పుడు మానేరు వాగులో తనుగుల ఇసుక క్వారీకి వెళ్లిన సందర్భాన్ని గుర్తు చేసి.. అక్కడ సీసీ కెమెరాలు లేవని అన్నారు. ఈ నెల 3వ తేదీన రవాణా విభాగంతో నిజామాబాద్, వరంగల్ రూట్లలో ఆకస్మిక తనిఖీలు చేయించినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. 83 ఇసుక లారీలను తనిఖీ చేస్తే.. 22 లారీలకు అనుమతి లేదని గుర్తించారు. ఒకే పర్మిట్, ఒకటే నెంబర్‌తో నాలుగైదు లారీలు ఇసుక రవాణా చేస్తున్నట్లు బయటపడిందని అన్నారు. ఈ లెక్కన 25 శాతం అక్రమంగా ఇసుక తరలిపోతుందని సీఎం అంచనాగా చెప్పారు. టీఎస్ఎండీసీ కేంద్రంగా జరుగుతున్న అక్రమాలను అరికట్టి, గనులు, భూగర్భ వనరుల విభాగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని సీఎం అన్నారు. సమీక్ష సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!

మొదటిపేజీ తరువాయి

పెట్టుకుని గడ్డపారతో పొడిచారని.. కనీసం తాము సూదితో అయినా పొడవకూడదా? అని ప్రశ్నించారు. అయితే తాము బీఆర్ఎస్ వాళ్లంత మూర్ఖులం కాదన్నారు. రాజకీయంగా కొన్ని తమకు తప్పదన్న జగ్గారెడ్డి.. బీఆర్ఎస్ చేసిన అలవాటే తాము కొనసాగిస్తామన్నారు.



**మీ దగ్గర ఎమ్మెల్యేలు సీఎంని కలిసే వాళ్లా..?**

మీ దగ్గర ఎమ్మెల్యేలు.. సీఎం ని కలిసే వాళ్లా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్.. హరీశ్‌దగ్గరికి పోయే వాళ్ళు అని, మీ ఎమ్మెల్యేలు మా దగ్గరికి వస్తే సీఎం ని కలుస్తారన్నారు. మల్లారెడ్డి కూడా మా దగ్గరకు రావచ్చు అని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆయన మాట్లాడటం లేదు కదా అని అన్నారు జగ్గారెడ్డి. 'మా ప్రభుత్వం పడేస్తాం అంటున్నారు మీరు .. కాంగ్రెస్‌ప్రభుత్వాన్ని కూల్చడం అంటే.. కూలి పోయే కాళేశ్వరం కట్టినట్టు అనుకుంటున్నవా? అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌నాసీరకం మెటీరియల్‌తో కట్టినట్టు కాదని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

తన దగ్గర డబ్బులు లేకపోవడం వల్లే ఎన్నికల్లో ఓడిపోయానని, కాళేశ్వరం పైసలతోనే తమ ఉమ్మడి జిల్లాలోని కొంత మంది కాంగ్రెస్ అభ్యర్థులను హరీశ్ రావు ఓడగొట్టారని ఆరోపించారు. వేముల ప్రశాంత్ రెడ్డి రాజకీయంలో చిన్న వ్యక్తి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజా సేవ చేయాలంటే మా పార్టీలోకి రండి. బీజేపీకి తెలంగాణలో బలం లేదు. వాళ్ల బలం కోసం ఏదైనా చేస్తారు. మెదక్ పార్లమెంట్‌లో పోటీ చేయమని హైకమాండ్‌నన్ను అడిగితే చేస్తాను. నా కుటుంబ సభ్యులకు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వమని అడగను.'' అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మర్యాదపూర్వకంగా అంటూ ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వ్యవహారం రాజకీయ దుమారం రేపడం తెలిసిందే. అటు పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. లోక్ సభ ఎన్నికలకు తెలంగాణలోని రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్న వేళ.. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వస్తారని జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ఇదో ప్రసంగమా?

మొదటిపేజీ తరువాయి



భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. గవర్నర్ ప్రసంగం అనేది విజన్ డాక్యుమెంట్ లాగా చూస్తామని, అయితే అది పేలవంగా ఉందన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు నిరాశ మిగిలిందన్న ఆయన...వృద్ధులు, వికలాంగులకు, ఆసరా పింఛన్‌దారులకు, మహిళలకు...గవర్నర్ ప్రసంగం నిరాశ కలిగించిందన్నారు. పంటకు బోనస్ గురించి మాట్లాడక పోవడం వల్ల రైతాంగానికి నిరాశే మిగిలిందన్న ఆయన...ప్రజలకు ఏలాంటి విశ్వాసం కల్పించలేదన్నారు. పల్లెలు, పట్టణాల అభివృద్ధి గురించి మాట్లాడలేదని...మేనిఫెస్టో అంశాల గురించి ఎక్కడా చెప్పలేదని హరీశ్ రావు విమర్శించారు.

నిరుద్యోగ భృతి గురించి చెప్పలేదన్న ఆయన...ప్రజావాణి తుస్సుమందని సెటైర్లు వేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...ప్రతి రోజూ వినతులు స్వీకరిస్తారని చెప్పారని...మంత్రులు, ఐఏఎస్ లు కూడా లేరని... చివరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దరఖాస్తులు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజావాణి గురించి అర్ధ సత్యాలు గవర్నర్ చేత చెప్పించారన్న హరీశ్ రావు... ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 ఉన్నాయని... రెండు అమలు చేసి మొత్తం చేసినట్లు చెబుతున్నారని విమర్శించారు. 10 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంచడంలో లోపం ఉందన్న హరీశ్ రావు.. ఈ కారణం చేతనే ఆ విషయాన్ని గవర్నర్ ప్రసంగంలో చేర్చలేదన్నారు. డిసెంబర్ 9 నాడు ప్రమాణం చేసి 2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారని...ప్రమాణ స్వీకారం రెండు రోజులు ముందు చేసి, ప్రజల హామీ మాత్రం వాయిదా వేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించిన హరీశ్ రావు....వంద రోజుల్లో 60 రోజులు పూర్తి అయ్యాయని...40 రోజులే ఉన్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తే హామీలు ఎలా అమలు చేస్తారని హరీశ్ రావు ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే హామీల అమలు గురించి గవర్నర్ ప్రసంగంలో ఉండేదన్న ఆయన.. దాని గురించి ఎందుకు ప్రస్తావించలేదన్నారు.గవర్నర్ ప్రసంగం అంటే ఏడాదికి విజన్ డాక్యుమెంట్ లాంటిదని...500 రూపాయలకే గ్యాస్, కరెంట్ 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తామన్నారని...వీటి గురించి మాత్రమే చెప్పారని తెలిపారు. అంటే మిగతా హామీలు వచ్చే ఏడాదిలో చేయలేమని చెప్పకనే చెప్పారన్న మాజీ మంత్రి... వంద రోజుల్లో అమలు చేయలేమని చేతులు ఎత్తేశారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన రెండు నెలల కాలంలో రైతులకు అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారన్న హరీశ్ రావు, వచ్చే యాసంగి పంటకు అయినా బోనస్ ఇస్తారని

# ఇది ప్రజా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి



రెండింటిని త్వరలో అమలు చేయనున్నామని అన్నారు. రూ. 500 కే అర్హులకు గ్యాస్ సిలిండర్లను త్వరలోనే అందించబోతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వెళ్లిందని, ప్రస్తుతం ప్రజలపై భారం వేయకుండా ఆర్థికంగా పునర్నిరించే ప్రయత్నాల్లో ఉన్నామన్నారు.

**గత ప్రభుత్వ నిర్వాకాలను ప్రజలకు తెలిపాం**

రాష్ట్ర ఏర్పాటులో కలిసివచ్చిన పార్టీలు, వ్యక్తులతోపాటు అప్పటి మన్మోహన్ సర్కార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ''ప్రత్యేకించి సోనియాగాంధీ షోషించిన పాత్రను ప్రభుత్వం స్మరించుకుంటోంది. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు ఇప్పటివరకూ 15 కోట్ల ట్రిప్పులు ప్రయాణించారు. పాలమూరు -రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ధరణి కమిటీ ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తాం. మా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పాటిస్తుంది. గత ప్రభుత్వం నిర్వాకాలను శ్వేతపత్రం ద్వారా ప్రజలకు తెలియజేశాం. రాష్ట్రంలో ప్రత్యేక నైపుణ్య వర్సిటీలు ఏర్పాటు చేస్తాం''. అన్నారు.

**12 ఫార్మా విలేజ్ క్లస్టర్లు!**

విద్యతో పాటు ఉద్యోగమూ సాధించేలా యువతలో నైపుణ్యాలు పెంపునకు కృషి చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, వికలాంగ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తాం. 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. హైదరాబాద్‌ను దేశంలోనే కృత్రిమ మేధ (ఏఐ) ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 50 నుంచి 100 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేస్తాం. రూ.2 వేల కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తాం. క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేయడమే మా లక్ష్యం. కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్ కేవలం ఆర్థిక పత్రం కాదు.. భవిష్యత్‌కు నమూనా'' అని చెప్పారు.

**ఇంటింటికీ ఇంటర్నెట్**

రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలు అందించనున్నామని గవర్నర్ చెప్పారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటు, సేవల రంగం విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. రూ. రెండు వేల కోట్లతో రాష్ట్రంలోని ఐఐటీలను అప్ గ్రేడ్ చేస్తామని చెప్పారు.

**ఫిబ్రవరి 10న బడ్జెట్**

గవర్నర్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడింది. తొమ్మిదో తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుంది. అదే రోజు శాసనసభ కార్యకలాపాల సలహాకమిటీ (బీఏసీ) సమావేశాన్ని నిర్వహించి, సభను ఎన్ని రోజులు నడపాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారు. ఆర్థిక శాఖను నిర్వహించే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఫిబ్రవరి 10న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. బడ్జెట్ సమావేశాలు సుమారు 710 రోజుల వరకు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది.తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాడారని, అందుకు అనుగుణంగానే పాలన కొనసాగుతోందని అన్నారు.

**కేసీఆర్ డుమ్మా...**

కాగా...రిపబ్లిక్‌డే రోజున గవర్నర్ స్పీచ్‌లో గత బీఆర్ఎస్ పాలనపై ఘాటైన విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. మరి నేటి గవర్నర్ స్పీచ్‌పై బీఆర్ఎస్ రియాక్షన్ ఎలా ఉండబోతుందో చూడాలి. మరోవైపు గురువారం అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ డుమ్మా కొట్టారు. అయితే నేడు ధన్యవాద తీర్మానం చేయడానికి ఆయన హాజరయ్యే అవకాశమున్నట్లు సమాచారం.

**కవిత చదివి గవర్నర్ ప్రసంగం షురూ..**

గవర్నర్ ప్రసంగంలో మొదటి పేజీలో పొందుపరిచిన అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు కవితతో గవర్నర్ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు. అయితే ఆ కవితలో గత ప్రభుత్వం తీరును ఎండగడుతూ గవర్నర్ వ్యాఖ్యలు చేశారు.

" అధికారమున్నదని హద్దు పద్దు లేక
అన్యాయమార్గాల నార్జింపబూనిన
అచ్చి వచ్చే రోజులంతమైనాయి
అచ్చి వచ్చే రోజులంతమైనాయి!"

అంటూ గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి గవర్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి.

# కేసీఆర్ 'ఎక్స్ పైరీ మెడిసిన్' లాంటోడు..

- బీఆర్ఎస్‌గురించి ఆలోచించడం ప్రజలు మానేశారు
- మీడియా చిట్‌చాట్ లో సీఎం రేవంత్ రెడ్డి

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:



కేసీఆర్.. 'ఎక్స్ పైరీ అయిన మెడిసిన్ లాంటి వాడు' అని రేవంత్ రెడ్డి సెటైర్ వేశారు. అసెంబ్లీ సమవేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం పూర్తయిన తర్వాత మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ పై సెటైర్లు వేశారు. అధికారం కోల్పోవడాన్ని కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని సీఎం కామెంట్ చేశారు. ''ప్రజలు వారిని పట్టించుకోవడం లేదు. గవర్నర్ ప్రసంగానికి కూడా కేసీఆర్ హాజరు కాలేదు. దీంతో ప్రతిపక్ష నేత ఏంటో అందరికీ తెలిసిపోతుంది. బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ రావాలని కోరుకుంటున్నా. ప్రతిపక్ష నేతగా ఆయన బాధ్యత నిర్వర్తించాలి. టీఎస్ పీఎస్ సీ, కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశాలపై ప్రొసీజర్ తో ప్రభుత్వం ముందుకెళ్తోంది. కసబ్ కు ఉరి కూడా.. ప్రొసీజర్ తోనే జరిగింది. భవిష్యత్‌లో నిరుద్యోగులు ఇబ్బందులు పడకూడదు. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయం మార్పు స్పీకర్ నిర్ణయం. అసెంబ్లీ సమావేశాల్లో కులగణన తీర్మానం ఉంటుంది. అవసరం అనుకుంటే సభా సమావేశాలను స్పీకర్ పొడిగించవచ్చు. కేఆర్ఎంబీకి ప్రాజెక్ట్ లను గత ప్రభుత్వమే కేంద్రానికి అప్పగించింది. సాగర్ ను ఏపీ సీఎం జగన్ పోలీసులతో ఆక్రమించినా.. కేసీఆర్ ఎందుకు పట్టించుకోలేదు' అని రేవంత్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సిటింగ్ జడ్జిని ఇవ్వలేమని హైకోర్టు చెప్పిందని రేవంత్ రెడ్డి తెలిపారు. విశ్రాంత జడ్జితో విచారణ జరిపించుకోవాలని సూచించినట్లు చెప్పారు. ఉన్నత న్యాయస్థానం చెప్పిన అంశంపై మంత్రివర్గంలో లేదా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథపైనా విచారణకు ఆదేశించామన్నారు.

**ఈ నెల 13 వరకు అసెంబ్లీ**

- బీఏసీ సమావేశంలో నిర్ణయం
- ఫిబ్రవరి 10న అసెంబ్లీలో బడ్జెట్
- 11న సెలవు, 12, 13 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

ఈ నెల 13వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 10న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 11న సెలవు ప్రకటించారు. 12, 13 తేదీల్లో బడ్జెట్‌పై చర్చించనున్నారు. అనంతరం అసెంబ్లీని వాయిదా వేయనున్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. అయితే కేసీఆర్‌కు బదులుగా హరీశ్‌రావు బీఏసీ సమావేశానికి వెళ్లారు. తన బదులుగా హరీశ్‌రావు బీఏసీకి వస్తారని కేసీఆర్ ముందే సమాచారం ఇచ్చారు. బీఏసీకి హరీశ్‌రావు రావడంపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఏసీ ప్రారంభమైన కాసేపటికే హరీశ్‌రావు బయటకు వచ్చారు.

# అసెంబ్లీలో రామన్న, రాజన్న ముచ్చట..

- 'మీకు మంత్రి పదవి ఎప్పుడు వస్తుంది'?
- 'మీలాగే నాకూ ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతోంది'
- 'లోక్‌సభ ఎన్నికల్లో కూతురు కీర్తి పోటీ చేస్తుందా'?
- వివాదంలోకి లాగొద్దంటూ వెళ్లిపోయిన రాజగోపాల్ రెడ్డి
- కేటీఆర్, కోమటిరెడ్డి మధ్య ఆసక్తికర సంభాషణ





విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో గురువారం బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. మంత్రి పదవి, లోక్ సభ ఎన్నికల్లో పోటీ అంశానికి సంబంధించి కేటీఆర్... రాజగోపాల్ రెడ్డిని ప్రశ్నించారు. అయితే తనను వివాదంలోకి లాగవద్దని సరదాగా వ్యాఖ్యానిస్తూ కోమటిరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అసెంబ్లీ ప్రాంగణంలో కేటీఆర్‌కు కోమటిరెడ్డి ఎదురయ్యారు. ఈ సమయంలో... 'మీకు మంత్రి పదవి ఎప్పుడు వస్తుంది'? అని కేటీఆర్ ప్రశ్నించారు. దీనికి కోమటిరెడ్డి.. బదులిస్తూ.. 'మీలాగే నాకూ ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతోంది'అని సమాధానం ఇచ్చారు. దీంతో కేటీఆర్...' ఫ్యామిలీ పాలన కాదు... మంచిగా పని చేస్తే కీర్తి ప్రతిష్ఠలు వస్తాయ్' అని అన్నారు. ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లో పోటీకి సంబంధించిన అంశంపై కేటీఆర్.. రాజగోపాల్‌రెడ్డిని అడిగారు. ఎంపీగా మీ కూతురు కీర్తి పోటీ చేస్తుందా? సంకీర్త్ పోటీ చేస్తున్నారా? అని అడిగారు. అయితే రాజగోపాల్ మాత్రం.. జవాబు చెప్పకుండా.. దయచేసి తనను వివాదంలోకి లాగవద్దని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

**'కేసీఆరే దగ్గరుండి బీజేపీలోకి పంపిస్తరు'**

అసెంబ్లీ లాబీలో రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ దగ్గరుండి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి పంపిస్తారని విమర్శించారు. వాళ్లను వాళ్లు కాపాడుకోవడానికి బీఆర్ఎస్ వాళ్లు బీజేపీలో చేరుతారన్నారు. తాను హోంమంత్రినై బీఆర్ఎస్ వాళ్లను జైలుకు పంపించాలని ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను గద్దె దించేందుకే తాను తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినట్లు చెప్పారు.

# గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్‌లో చేరుతున్నారు. స్థానిక నేతల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు ఈ వలసల పర్వం కొనసాగుతుండడం బీఆర్ఎస్‌ను కలవరపెడుతోంది. భవిష్యత్‌లోనూ ఇది కొనసాగే అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకత్వంలో కలవరం మొదలైంది. తాజాగా మరో కీలక నేత బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరారు.



కారు దిగి 'హస్తం' గూటికి..

జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపా మున్షీ సమక్షంలో బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరుపై బాబా ఫసియుద్దీన్ కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఉద్యమకారులకు పార్టీలో ప్రాధాన్యం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో ప్రాణహాని ఉందని చెప్పినా హైకమాండ్ పట్టించుకోలేదంటూ బాబా చెప్పారు. కాగా ఇటీవల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎంపీ వెంకటేశ్ కూడా పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన.. పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు

మొదటిపేజీ తరువాయి

మాట్లాడిన పట్నం మహేందర్ రెడ్డి సునీత మహేందర్ రెడ్డి సీఎంకు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీలో చేరే అంశంపై చర్చించినట్లుగా తెలుస్తోంది. అయితే పట్నం మహేందర్ రెడ్డి చేవెళ్ల ఎంపీ సీటు ఆశిస్తున్నట్లుగా ఆయన సోదరుడు పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. అందుకే ముఖ్యమంత్రిని కలిసి ఉంటారని ఆయన చెప్పారు. రాజకీయాల్లో ఎవరి అభిప్రాయం వారిది..అయితే కాంగ్రెస్ పార్టీలో చేరే విషయంపై మాత్రం తనకు చెప్పలేదన్నారు పట్నం మహేందర్ రెడ్డి సోదరుడు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి.

**'హస్తం' గూటికి చేరడం ఖాయమే!**

అయితే పట్నం మహేందర్ రెడ్డి దంపతులతో పాటు ఆయన కుమారుడు కూడా ఉన్నారు. పట్నం దంపతులు త్వరలోనే కాంగ్రెస్ లో చేరుతారనే సమాచారం అందుతోంది. పట్నం మహేందర్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల సీటు ఆశిస్తున్నట్లుగా సమాచారం. అయితే దీనిపై రేవంత్ రెడ్డి కూడా హామీ ఇచ్చే ఉంటారని పట్నం మహేందర్ రెడ్డి సోదరుడు పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. అయితే తన అన్న మహేందర్ రెడ్డి , వదిన సునీతా మహేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన విషయం తాను మీడియాలో చూశానని చెప్పారు పట్నం నరేందర్ రెడ్డి. వెళ్లే ముందు నాకెలాంటి సమాచారం లేదని, అయినా రాజకీయాలలో ఎవరి ఇష్టాలు వారివి.. వారికి చేవెళ్ల లోక్ సభకు పోటీ చేసేందుకు హామీ ఇచ్చినట్టున్నారు.. అందుకే వాళ్లు సీఎం రేవంత్ రెడ్డి ని కలిసారనుకుంటానని చెప్పారు. తాను మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. అన్నయ్య కుమారుడు జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి కూడా చేరుతారా? లేదా? నాకు సమాచారం లేదన్నారు. అయితే పట్నం దంపతులు అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ లో చేరుదామనుకున్నారు. అప్పుడు సీటు ఇవ్వకపోవడంతో పట్నం మహేందర్ రెడ్డిని ఎమ్మెల్సీని చేసి మంత్రి పదవి కట్టబెట్టారు కేసీఆర్. అయితే ఎన్నికలకు ముందే కాంగ్రెస్ లో చేరుతామని తనతో పట్నం మహేందర్ రెడ్డి, సునీతా మహేందర్ రెడ్డి చర్చించారని తాను తిరస్కరించానని తెలిపారు నరేందర్ రెడ్డి. రేవంత్ రెడ్డిని పట్నం మహేందర్ రెడ్డి దంపతులు కలిసిన సమయంలో తెలంగాణ విద్యాశాఖ మంత్రి దామోదర రాజనరసింహ కూడా ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
AP NEWS
ఆంధ్రప్రదేశ్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com


# కేసీఆరే ఓడిపోయారు.. జగన్ ఎంత..?

- **సీఎం జగన్ పై నాగబాబు విమర్శలు**
- **జగన్ ఆంధ్ర జాతికే ప్రమాదం**
- **కరోనా తర్వాత అంతటి ప్రమాదకర వైరస్ వైసీపీ**



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్ర రాజకీయాలు రసవత్తర మలుపు తిరగబోతున్నాయి. ఇప్పటికే టీడీపీ, జనసేనలు పొత్తులో ఉండగా తాజాగా బీజేపీ ఈ కూటమిలో చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిన్న రాత్రి ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాలతో టీడీపీ అధినేత చంద్రబాబు భేటీ కావడం అందరికీ తెలిసిందే. దీంతో, ఈ మూడు పార్టీల మధ్య పొత్తు కుదరబోతోందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన నేత కొణిదెల నాగబాబు చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ఏపీలో అద్భుతం జరగబోతోందని నాగబాబు అన్నారు. అద్భుతం జరుగుతున్న తరుణంలో జనసైనికులందరూ సహకరించాలని ఆయన కోరారు. సీఎం జగన్, వైసీపీలు ఆంధ్ర జాతికే ప్రమాదకరమని అన్నారు. కరోనా తర్వాత అంతటి ప్రమాదకరమైన వైరస్ వైసీపీనే అని చెప్పారు. ఈ వైరస్ కు విరుగుడు జనసేన, టీడీపీలే అని అన్నారు. జరుగుతున్న, జరగబోతున్న పరిణామాలకు అందరూ సహకరించాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ నే ఆ రాష్ట్ర ప్రజలు ఓడించి, ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని నాగబాబు అన్నారు. అలాంటిది ఏపీలో ఏ అభివృద్ధి చేయకుండా, రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్ ను ప్రజలు ఎందుకు గెలిపిస్తారని ప్రశ్నించారు. వైసీపీని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమయిందని చెప్పారు.

# రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన సీఎం జగన్

- **రాజ్యసభ అభ్యర్థులుగా వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి**
- **ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు కూడా అవకాశం**



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే ముగ్గురు అభ్యర్థులను సీఎం జగన్ ఖరారు చేశారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి పేర్లను ఫైనలైజ్ చేశారు. అభ్యర్థుల పేర్లను వైసీపీ అధికారికంగా ప్రకటించింది. మరోవైపు జగన్ ను వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి కలిశారు. రాజ్యసభకు తమకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వీరు ముగ్గురినీ ముఖ్యమంత్రి అభినందించారు. రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపికైన వారిలో ఇద్దరు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కాగా.. ఒకరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు. తొలుత మూడో స్థానం కోసం ఆరని శ్రీనివాసులు పేరును జగన్ ఎంపిక చేశారు. అయితే, ఆ తర్వాత ఆయన స్థానంలో మేడా రఘునాథరెడ్డి పేరును చేర్చడం జరిగింది. ఈరోజు నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ నెల 27న పోలింగ్ జరుగుతుంది.

# దేవినేని ఉమా ఇంట విషాదం

- **సోదరుడు దేవినేని చంద్రశేఖరరావు మృతి**
- **ఊపిరితిత్తుల సమస్య**
- **కంచికచర్లలో అంత్యక్రియలు**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:**



మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమా మహేశ్వరరావు ఇంట విషాదం నెలకొంది. విషాదం నెలకొంది. ఆయన సోదరుడు దేవినేని చంద్రశేఖర రావు గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో పాటు.. ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అడ్మిట్ అయి చికిత్స తీసుకున్నారు. తన సోదరుడు ఆస్పత్రిలో ఉండటంతో.. దేవినేని ఉమా మూడు రోజులుగా హైదరాబాద్ లోనే ఉండి.. ఎప్పటికప్పుడు అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ వచ్చారు. గురువారం ఉదయం ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో.. కన్నుమూశారు. ఆయన మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వస్థలమైన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు తరలించారు. ఈరోజు సాయంత్రమే అంత్యక్రియలు జరగనున్నాయి. దేవినేని చంద్రశేఖరరావు మరణవార్త విన్న టిడిపి నేతలు.. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపి.. దేవినేని ఉమా ను ఫోన్ లో పరామర్శించారు. సోదరుడి మృతితో దేవినేని ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి.



# చంద్రబాబుపై గల్లా జయదేవ్ ప్రశంసల జల్లు

- **ఢిల్లీలో చంద్రబాబు పర్యటన**
- **గల్లా జయదేవ్ ఇంట చంద్రబాబుకు ఆతిథ్యం**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాజకీయాల నుంచి వైదొలగుతున్నానని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడంలేదని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తన చివరి పార్లమెంటు సమావేశాల్లో పాల్గొంటున్నారు.i పార్లమెంటు సమావేశాల్లో ఆయన టీడీపీ ఎంపీలతో కలిసి కనిపిస్తున్నారు. కాగా, బుధవారం నాడు ఢిల్లీ వచ్చిన చంద్రబాబుకు గల్లా జయదేవ్ తన నివాసంలోనే ఆతిథ్యమిచ్చారు. ఎయిర్ పోర్టు నుంచి నేరుగా గల్లా నివాసానికి వెళ్లిన చంద్రబాబు అక్కడ్నించే అమిత్ షాను కలవడానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో, గల్లా జయదేవ్ సోషల్ మీడియాలో స్పందించారు. చంద్రబాబుపై ప్రశంసల జల్లు కురిపించారు. "గత రెండ్రోజులుగా మా దార్శనిక నేత చంద్రబాబుతో గడపడం ఎంతో సుసంపన్నమైన, ఆలోచనాత్మకమైన అనుభూతిని కలిగించింది. ఏపీ ప్రజల హక్కుల కోసం మేం పార్లమెంటులోనూ, వెలుపల సాగిస్తున్న పోరాటంలో వివిధ సమస్యల క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆయన పరిజ్ఞానం, అవగాహన వెలకట్టలేనివి. గత పదేళ్లుగా, నా పదవీకాలంలో మీ అచంచల ప్రోత్సాహానికి, మీరందించిన స్ఫూర్తికి కృతజ్ఞతలు సర్. మీ నాయకత్వం మా అందరికీ వెలుగు దివ్వె వంటిది" అంటూ గల్లా జయదేవ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు. అంతేకాదు, చంద్రబాబుతో కలిసున్న ఫొటోలను కూడా పంచుకున్నారు.

# జగన్‌తో బీజేపీ డ్యాన్సులు చేస్తోంది

- **పీసీసీ చీఫ్ షర్మిల విమర్శలు**
- **దెందులూరు సభలో పాల్గొన్న షర్మిల**
- **బీజేపీతో వైసీపీ, టీడీపీ పొత్తు**



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** బీజేపీకి జగన్ తొత్తుగా మారారంటూ ఏపీ సీఎంపై పీసీసీ చీఫ్ షర్మిల మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకునిగా ఎన్నో ఉద్యమాలు చేసిన జగన్, అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యమం కూడా చేయలేదంటూ ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా కోసం మూకుమ్మడిగా రాజీనామా చేద్దామన్న జగన్.. తరువాత ఆ ఊసే ఎత్తలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్, చంద్రబాబు ఇద్దరూ బీజేపీతో ఒకరు ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకుంటే, మరొకరు పరోక్షంగా పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. ఒకవైపు జగన్‌తో మరోవైపు చంద్రబాబుతో బీజేపీ డ్యాన్సులు చేస్తుందని, డ్యూయట్లు పాడుతోందని అన్నారు. ఈ మేరకు ఏలూరులోని దెందులూరు మండలం పోతునూరులో షర్మిల మాట్లాడారు. ముఖ్యంగా సీఎం జగన్‌పై విమర్శల వర్షం కురిపించారు "పదేళ్లుగా మన రాష్ట్రానికి ఒక్క విభజన హామీ కూడా సాధించుకోలేకపోయాము. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎంత అవసరమో అందరికీ తెలుసు. ప్రత్యేక హోదా కోసం ప్రతిపక్ష నాయకునిగా ఎన్నో ఉద్యమాలు చేసిన జగన్ అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యమం కూడా చేయలేదు. ప్రత్యేక హోదా కోసం మూకుమ్మడి రాజీనామా చేద్దామన్న జగన్.. తరువాత ఆ ఊసే ఎత్తలేదు. బీజేపీకి జగన్ తొత్తుగా మారారు. బీజేపీ మన రాష్ట్రానికి ఒక్క హామీ నెరవేర్చలేదు. రేపు జగన్ ఢిల్లీ వెళ్లి బీజేపీకి సాష్టాంగ నమస్కారం చేస్తారు. ఒకరు ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకుంటే, మరొకరు పరోక్షంగా పొత్తు పెట్టుకున్నారు. ఒకవైపు జగన్‌తో మరోవైపు చంద్రబాబుతో బీజేపీ డ్యాన్సులు చేస్తోంది. డ్యూయట్లు పాడుతున్నారు.' అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యాత్ర2 సినిమా కోసం అసెంబ్లీ వాయిదా

- **వైసీపీపై అచ్చెన్నాయుడు మండిపాటు**
- **అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన టీడీపీ**
- **చివరి రోజుకు అసెంబ్లీ సమావేశాలు**



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు చివరి రోజుకు చేరుకున్నాయి.అయితే.. అసెంబ్లీ సమావేశాల చివరి రోజును తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బహిష్కరించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వినాశక చట్టాలు చేసిందని ఆ ప్రతులను అసెంబ్లీ బయట తగలుబెట్టారు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మూడు రాజధానులు చట్టం, మద్యం అమ్మకాల తాకట్టు, మీడియాపై ఆంక్షలు వంటి జీవోలు దహనం చేశారు. పోలవరం రివర్స్ టెండరింగ్ ప్రతులు, ఇతర ప్రజా వ్యతిరేక నిర్ణయాల ప్రతులను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దగ్ధం చేశారు. ఈ ప్రభుత్వానికి ఇదే చివరి అసెంబ్లీ రోజు అంటూ నినాదాలు చేశారు. నేటితో రాష్ట్రానికి పట్టిన శని, దరిద్రం వదిలిపోయిందని నినదించారు టీడీపీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు. ఇక, ఈ సందర్భంగా టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఐదేళ్ల శాసనసభ చీకటి సభే.. చివరి రోజు కూడా యాత్ర సినిమా కోసం సభను 2 గంటలు వాయిదా వేశారని విమర్శించారు.. ఇక, టీడీఎల్పీ ఉపనేత నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఐదేళ్ల శాసనసభలో ప్రతీ రోజూ బ్లాక్ డేనే అని విమర్శించారు. ప్రజల ఆత్మాభిమానం, ఆత్మగౌరవం శాసనసభ లో మంటగలిసిందంటూ ఫైర్ అయ్యారు. మరోవైపు.. ఆశా వర్కర్లపై లాఠీచార్జ్ చేయడం జగన్ రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనం అని మండిపడ్డారు అచ్చెన్నాయుడు.. సమస్యలు పరిష్కరించమంటే అక్రమ అరెస్ట్ చేసి నిర్బంధిస్తారా? ఐదేళ్లుగా ఆశాలతో జగన్ రెడ్డి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఆదాయ పరిమితి నిబంధనతో ఆశాలను సంక్షేమానికి దూరం చేశారు. సెలవులివ్వకుండా, పని భారంతో ఒత్తిడి పెంచడం అమానుషం కాదా? ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే నిరసన తెలపడం నేరమెలా అవుతుంది? అని ప్రశ్నించారు. తక్షణమే ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. సకాలంలో వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు అచ్చెన్నాయుడు.



# సీ ఓటర్ సంస్థ సర్వేపై నమ్మకం లేదు

- **సజ్జల రామకృష్ణారెడ్డి**
- **మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే ఫలితాలు విడుదల**
- **టీడీపీకి 17, వైసీపీకి 8 స్థానాలు వస్తాయన్న సర్వే**

ఆంధ్రప్రదేశ్, విశాలభారతి: ఇండియాటుడేసీ ఓటర్ మూడ్ ఆఫ్ ద నేషన్ పేరిట నిర్వహించిన సర్వేలో ఏపీలో టీడీపీకి 17, వైసీపీకి 8 లోక్ సభ స్థానాలు వస్తాయని వెల్లడైంది. దీనిపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు. సీ ఓటర్ సంస్థ చేసిన సర్వేకు విశ్వసనీయత లేదని కొట్టిపారేశారు. 2019 మార్చిలో కూడా ఆ సంస్థ ఇలాంటి సర్వేనే చేసిందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల్లో వైసీపీకి 35 శాతం ఓట్లు, టీడీపీకి 4142 శాతం ఓట్లు వస్తాయని చెప్పిందని టీడీపీకి 15 సీట్లు, వైసీపీకి 10 సీట్లు వస్తాయని చెప్పిందని సజ్జల వివరించారు. అదే సంస్థ ఎగ్జిట్ పోల్స్ లో తమకు 11 సీట్లు, టీడీపీకి 14 సీట్లు ఇచ్చిందని.. కానీ ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చాయో అందరికీ తెలిసిందేనని అన్నారు. "ఆ ఎన్నికల్లో మాకు 22 సీట్లు, టీడీపీకి 3 సీట్లు వచ్చాయి. ఓట్ల శాతం కూడా మాకే ఎక్కువగా వచ్చింది. సీ ఓటర్ సర్వే విశ్వసనీయత అలా ఉంటుంది" అని సజ్జల వివరించారు. సర్వేలను గురించి తాము పెద్దగా పట్టించుకోబోమని, తాము చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందని అన్నారు. ఈ ఐదేళ్లలో మేం చేసిన పనులు ఇవీ అని చెబుతూ ప్రజల దీవెనలు కోరడానికి మేమెంత ఆత్మవిశ్వాసంతో ఉన్నామో నాలుగు ఓట్లు రాబట్టుకోవడానికి టీడీపీ, చంద్రబాబు ఎంత నిరాశానిస్పృహలతో ఉన్నారో గమనించాలి అని పిలుపునిచ్చారు.

# త్వరలో యాత్ర-3 సినిమా ఉంటుంది

- **వైసీపీ ఎంపీ మార్గాని భరత్**
- **యాత్ర-2 మూవీ వంద శాతం విజయం సాధిస్తుంది**
- **పార్టీ నేతలతో కలిసి సినిమా చూసిన పార్టీ యువనేత**



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఆధారంగా తెరకెక్కిన 'యాత్ర2' సినిమా ప్రీమియర్ షోని ఎంపీ మార్గాని భరత్ రాజమండ్రిలో వీక్షించారు. యాత్ర2 సినిమా ప్రజలు మెచ్చే సినిమా అని ప్రశంసించారు. ప్రజలను నమ్ముకుంటానంటూ జగన్ చెప్పిన మాట, ఆయన సవాళ్లను ఎదుర్కొంటూ ఏవిధంగా ముందుకొచ్చారనే అంశాలన్నీ ఈ సినిమాలో ఉన్నాయని చెప్పారు. సినిమాను అందరం ఎంజాయ్ చేశామని, ఈ సినిమా వంద శాతం సూపర్ డూపర్ హిట్ అవుతుందని ఆకాంక్షించారు. సీఎం జగన్ ప్రస్థానంపై త్వరలోనే యాత్ర3 సినిమా కూడా ఉంటుందని చెప్పారు. ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, ఇతర స్థానిక నేతలు, కార్యకర్తలతో కలిసి రాజమండ్రిలో 'యాత్ర2' సినిమాను చూశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాగా యాత్ర2 ప్రీమియర్ షో సందర్భంగా రాజమండ్రిలోని రంభ, ఊర్వశి, మేనక థియేటర్ల వద్ద వైసీపీ అభిమానులు టపాసులు పేల్చారు. వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.




# కోడి కత్తి శ్రీనుకి బెయిల్

- **షరతులు విధించిన హైకోర్ట్**
- **20218, అక్టోబర్ 25న జగన్ పై దాడి**
- **విశాఖ జైలు నుంచి రేపు విడుదలయ్యే అవకాశం**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై హత్యాయత్నం కేసులో జనుపల్లి శ్రీనివాస్‌కు ఏపీ హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. 20218, అక్టోబర్ 25న విశాఖపట్నం ఎయిర్ పోర్టులో అప్పటి విపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్ పై కోడి కత్తితో నిందితుడు జనుపల్లి శ్రీనివాస్ దాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో అరెస్టైన అతడు అప్పటి నుంచి జైల్లోనే ఉన్నాడు. తనకు బెయిల్ మంజూరు చేయాలని పలుమార్లు ఎన్ఐఏ కోర్టును అభ్యర్థించినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఉన్నత న్యాయస్థానం అతడికి తాజాగా బెయిల్ మంజూరు చేసింది. జగన్‌పై దాడి సమయంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో విధులు నిర్వహించిన అధికారి సాక్ష్యం చెప్పారని, సీఎం జగన్మోహన్ రెడ్డి ఇప్పటివరకు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పలేదని వెల్లడించారు. మొదట ఈ కేసు విశాఖపట్నం కోర్టులోనే విచారణ చేశారని, తర్వాత ఎన్ఐఏ పరిధిలోకి రావడంతో విజయవాడలోని ఎన్ఐఏ కోర్టుకు బదిలీ చేశారని చెప్పారు. కొంత కాలం క్రితం విశాఖపట్నంలో ఎన్ఐఏ కోర్టు పెట్టడంతో ఈ కేసును మరోసారి అక్కడికి బదిలీ చేశారని తెలిపారు. కాగా, విశాఖ జైలు నుంచి రేపు శ్రీనివాస్ విడుదలయ్యే అవకాశముంది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అతడు చేయాల్సిన, చేయకూడని పనుల గురించి లాయర్ సింధు వివరించారు. షరతులు అతిక్రమిస్తే హైకోర్టు బెయిల్ రద్దు చేసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు.



# ఎద్దుకు అంత్యక్రియలు

- **ఎస్ కోట మండలం మామిడిపల్లి ఘటన**
- **గ్రామమంతా ఊరేగించి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** విజయనగరం జిల్లాలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. అనారోగ్యంతో చనిపోయిన ఎద్దుకి గ్రామంలో డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, భజనలతో గ్రామమంతా ఊరేగించి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు గ్రామస్తులు. తమ గ్రామంలో చనిపోయిన బసవన్న ఎద్దు కాదని తాము ఎంతగానో నమ్మే తమ ఆరాధ్య దైవం సింహాచలం అప్పన్న ప్రతిరూపమని అలాంటి బసవన్న తమకు దూరం కావటం తట్టుకోలేక పోతున్నామని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్ కోట మండలం మామిడిపల్లిలో జరిగిన ఈ ఘటన చుట్టుప్రక్కల గ్రామాల వారిని సైతం కలిచివేసింది. గత కొన్ని సంవత్సరాలుగా మామిడిపల్లి గ్రామంలో ఒంటరి బసవన్న సంచరిస్తూ ఎవరిని ఏమీ అనకుండా, ఎవరు ఏది పెడితే అదే తింటూ అందరి మన్ననల్ని పొందింది. అందరికీ తల్లో నాలుకలా ఉంటూ జీవనం సాగించింది. ఈ క్రమంలోనే ఇక్కడి గ్రామస్తులు కూడా సుఖ సంతోషాలతో, ఆనందంగా ఉండటంతో తమ గ్రామంలో బసవన్న సంచరిస్తుంది కాబట్టే గ్రామమంతా సుభిక్షంగా ఉందని బసవన్న పై అమితమైన విశ్వాసం పెంచుకున్నారు. ఆ నమ్మకంతోనే ప్రతిరోజు బసవన్నకు పూజలు చేయడం, మంచి మంచి ఆహారం పెట్టడం చేస్తుండేవారు గ్రామస్తులు. బసవన్నకు ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే గ్రామస్తులు స్పందించి వెటర్నరీ డాక్టర్ కి చూపించి జాగ్రత్తలు తీసుకునేవారు. అలా ఏళ్ల తరబడి తమతోనే తమ గ్రామంలోనే సంచరిస్తుండటంతో గ్రామస్తులు కూడా బసవన్నతో అనుభందం పెంచుకున్నారు. బసవన్నను సింహాచలం అప్పన్న స్వామిగా భావించడం వల్ల గ్రామస్తులెవరు బసవన్నను కొట్టడం గానీ, తిట్టడం గాని చేసేవారు కాదు. నిత్యం బసవన్న బాగోగులు చూస్తూ ఉండేవారు. బసవన్న సంతోషంగా ఉంటే తమ గ్రామం కూడా సంతోషంగా ఉంటుందనే విశ్వాసాన్ని మరింతగా పెంచుకున్నారు. ఈ క్రమంలోనే బసవన్న అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తమ గ్రామ దేవదేవుడు తమకు దూరమయ్యాడని రోధించారు. వెంటనే గ్రామస్తులు అంతా కలిసి పెద్ద ఎత్తున లాంఛనంగా అంత్యక్రియలు జరిపేందుకు నిర్ణయించుకున్నారు. మేళతాళాలతో, భజనలతో, డప్పు వాయిద్యాల నడుమ వందలాది మంది గ్రామస్తుల తోడ్పాటుతో బసవన్న అంతిమయాత్ర ఊరేగింపుగా జరిపారు.



# సిండికేట్ జోరు .. ఆపేవారు లేరు!

## మద్యం వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు

## విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహణ

## ఎమ్మార్పీ ధరలకు కళ్లెం

## ముడుపుల మత్తులో ఎక్సైజ్ శాఖ



**వాజేడు/విశాలభారతి :** ఏజెన్సీలో మద్యం సిండికేట్ జోరు దానిని ఆపేవారు ఎవరు లేరు దీనితో మద్యం వ్యాపారుల ఇస్తారాజ్యం కొనసాగుతుంది విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహణ కొనసాగిస్తూ ఎమ్మార్పీ ధరలకు కళ్లెం వేస్తున్నారు మద్యం వ్యాపారులతో సంబంధిత శాఖ అధికారులు కుమ్మక్కై ముడుపుల మత్తులో జోగుతున్నారని ఆరోపణ వ్యక్తం అవుతున్నాయి మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లాలోని వెంకటాపురం వాజేడు మండల పరిధిలో అక్రమ మద్యం వ్యాపారం మూడు పువ్వుల ఆరు కాయలుగా విరజిల్లుతుంది ప్రభుత్వ నిబంధనలకు పాత రేస్తు తమ వ్యాపారాన్ని ఎంచక్కగా సాగిస్తున్నారు అక్రమార్కులకు అధికారులు అండగా నిలవడంతో మందుబాబులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా వెంకటాపురం వాజేడు మండలాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుపుతూ తమ ఇష్టారాజ్యాన్ని కొనసాగిస్తున్నారు. ఎమ్మార్పీ ధరలకు కళ్లెం వేస్తూ అధిక రేట్లకు బెల్ట్ షాపులకు సరఫరా చేస్తూ మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడు కరువయ్యాడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం అమ్మకాలు జరిగే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవలసిన సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మద్య వ్యాపారులతో కుమ్మక్కై వారు ముట్టజెప్పే ముడుపులకు తలొగ్గి ముడుపుల మత్తులో జోగుతుండడంతో మద్యం వ్యాపారుల ఇస్తారాజ్యం కొనసాగుతుందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. లైసెన్స్ మద్యం షాపుల్లో ధరల పట్టిక ఏర్పాటు చేసి సమయపాలన పాటిస్తూ ఎంఆర్పి ధరలకే మద్యం విక్రయాలు జరపాల్సిన మద్యం వ్యాపారులు తమ ఇష్టానుసారంగా సమయపాలన పాటించకుండా తమకు ఇష్టం వచ్చిన సమయంలో మద్యం షాపులను తెరిచి బెల్టు షాపులకు మద్యం బాటిల్ సరఫరా చేస్తూ బెల్ట్ షాపులకు సరఫరా ముగియగానే లైసెన్స్ మద్యం షాపులను మూసివేసి ఇంటి బాట పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరుపుతుండడంతో వాటిని కొనుగోలు చేసే మద్యం ప్రియులు నిలువు దోపిడీకి గురవుతున్నారు బెల్టు షాపుల్లో ఒక్కొక్క కోటర్ కోటర్ బాటిల్ పై 30 నుంచి 40 రూపాయలు అదనంగా వసూలు చేస్తుండడంతో మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో మద్యం వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి రెండు మండలాలలో ఒకే రేటు నిర్ధారించి అధిక ధరలకు బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరు ఎత్తని రీతిలో వ్యవహరిస్తున్నారు. సిండికేట్ వ్యాపారం గత కొద్ది నెలలుగా నిర్వహిస్తూ మద్యం వ్యాపారులు మందుబాబులను అడ్డంగా దోచుకుంటున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ అధికారులకు మధ్య చీకటి ఒప్పందాలు కుదరడం వలన సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### బెల్ట్ షాపులపై చర్యలేవి?

వెంకటాపురం వాజేడు మండలాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహణ కొనసాగిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నప్పటికీ బెల్ట్ షాపులపై సంబంధిత శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ అధికారుల మధ్య ఒప్పందాలు కుదరడం వలన బెల్ట్ షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించడంలో ఉన్న శ్రద్ధ బెల్ట్ షాపులపై ఎందుకు లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి మద్యం వ్యాపారులు స్థానిక అధికారులను మేనేజ్ చేసుకుని అక్రమ సిండికేట్ వ్యాపారం ఏజెన్సీ ప్రాంతంలో కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి అధిక ధరలకు మధ్య విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



# మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో స్టూడెంట్ సూసైడ్

- క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సెలెక్ట్ కాలేదని మనస్తాపం
- స్టూడెంట్‌వనపర్తి జిల్లాకు చెందిన ఎండీ మహ్మద్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పీఎస్‌పరిధిలో మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ స్టూడెంట్ ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. కాలేజీలో ప్లేస్‌మెంట్ దొరకలేదని నిరాశతో హాస్టల్ రూమ్ లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకెళ్తే.. మేడ్చల్ జిల్లా మైసమ్మ గూడ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎండీ మహ్మమద్(22)..కాలేజీ సమీపంలో సత్యదేవ్ బాయ్స్ హాస్టల్లో ఉండేవాడు. గత వారం జరిగిన కాలేజీ క్యాంపస్ సెలక్షన్స్ లో ప్లేస్మెంట్ దొరకకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన స్టూడెంట్ సూసైడ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడు వనపర్తి జిల్లాకు చెందిన మహమ్మద్ బలేమియా కుమారుడు. బలేమియా వృత్తి రీత్యా ఆటోడ్రైవర్. ఇతని చిన్న కుమారుడే ఎండీ మహమ్మద్. క్యాంపస్ సెలక్షన్స్ లో సెలెక్ట్ కాకపోవడంతో ముభావంగా ఉంటున్న మహమ్మద్ చదువుకుంటాను అని చెప్పి హాస్టల్ భవనంలో ఉన్న ఐదో ఫ్లోర్లో ఒక రూమ్ లోకి వెళ్లాడు. మహమ్మద్ ఎంతకు కిందకి రాకపోవడంతో అతని స్నేహితులు, హాస్టల్ సిబ్బంది కలిసి ఐదో ఫ్లోర్ లో మహమ్మద్ వెళ్లిన రూమ్ వద్దకు వెళ్లారు. తలుపు ఎంతకీ తీయకపోవడంతో, తలుపులు పగలగొట్టారు. అనంతరం లోపల వేలాడుతున్న డెడెబాడీ చూసి అందరూ షాక్‌కు గురయ్యారు. మహమ్మద్ విగత జీవిగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలేజీ మేనేజ్‌మెంట్, స్టూడెంట్ల కంప్లైంట్‌మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎల్లుండి నుంచి .. బండి సంజయ్ యాత్ర

- కరీంనగర్‌నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమే లక్ష్యం
- ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని శక్తిగా బీజేపీ
- రూట్‌సిద్ధం చేశామని బీజేపీ నాయకుల వెల్లడి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎల్లుండి ( ఈనెల 10) నుంచి మరోసారి యాత్రకు సిద్ధమయ్యారు. ప్రజాహితమే లక్ష్యంగా.. కేంద్ర అభివృద్ధి పథకాలను జనంలోకి తీసుకెళ్లడమే ధ్యేయంగా.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంపై తిరిగి కాషాయ జెండా ఎగరేయడమే అంతిమంగా ఈ యాత్ర కొనసాగనుంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాలను, వీలైనన్ని ఎక్కువ గ్రామాల్లో "ప్రజాహిత పాదయాత్ర" చేసేలా రూట్ మ్యాప్ ను సిద్ధమైంది.



అందులో భాగంగా కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించి మేడిపల్లి కేంద్రం నుంచి బండి సంజయ్ తన యాత్రను ప్రారంభించనున్నారు. ఈనెల 10 నుంచి 15 వరకు జరిగే యాత్ర తొలివిడతలో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో చేపట్టనున్నారు. సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లల్లిలో తొలివిడత ముగింపు సభను నిర్వహించనున్నారు. తొలిదశలో మొత్తం 119 కి.మీల మేరకు యాత్ర చేయనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో యాత్ర చేయడంతోపాటు అధిక సంఖ్యలో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మమేకమవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. నరేంద్రమోదీ ప్రభుత్వం గ్రామాల, పట్టణాల అభివృద్ధికి వెచ్చించిన నిధులను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో జాతీయ కార్యవర్గ సమావేశాలు ఉన్న నేపథ్యంలో ఈనెల 20 నుంచి మలి విడత యాత్రకు చేపట్టనున్నారు. మరోవైపు యాత్ర సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాలు, మున్సిపాలిటీల మీదుగా యాత్ర చేసేలా రూట్ మ్యాప్ రూపొందిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు బండి సంజయ్ యాత్రను కొనసాగించేలా బీజేపీ నేతలు షెడ్యూల్ ను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రజా సంగ్రామ యాత్ర విజయవంతంతో తెలంగాణలో బీజేపీ రూపురేఖలే మారిపోయాయని, అదే తరహాలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేపట్టే యాత్రతో నియోజకవర్గంలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవించబోతుందన్నారు. ప్రజా సంగ్రామ యాత్ర చేసిన ప్రతి చోటు బీజేపీ బలపడిందని, ఓటింగ్ శాతం కూడా పెరిగిందని బండి సంజయ్ చెప్పారు. తాజాగా చేపట్టే యాత్రతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ రూపు రేఖలే మారిపోతాయని, రాబోయే ఎన్నికల్లో ఎంపీ సీటుతోపాటు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యమన్నారు.

# ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్

- ఉచిత ప్రయాణం వల్ల గిరాకీ లేక ఆత్మహత్యలు
- ఆటో డ్రైవర్లకు మద్దతుగా ఆటోలో అసెంబ్లీకి
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**విశాలభారతి, హైదరాబాద్:** ఆరు లక్షల మంది ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల గిరాకీ లేక ఇప్పటివరకు 18 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఆటో డ్రైవర్లకు మద్దతుగా తాను ఆటోలో అసెంబ్లీకి వచ్చానని, అయితే ఆటోను లోపలికి అనుమతించలేదని చెప్పారు. ఆటోను ఎందుకు లోనికి రానివ్వలేదు? కార్లో వస్తేనే రానిస్తారా? అని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆటోలో అసెంబ్లీకి చేరుకున్నారు. అయితే ఆయనను భద్రతా సిబ్బంది ఆటోలో లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆటోలకు అసెంబ్లీలోకి అనుమతి లేదని చెప్పడంతో ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది.



# తట్టేపల్లి రిజర్వాయర్ను నిర్మించాలి

- మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి.
- సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షులు అంగోతు రాంబాబు నాయక్.

**హైదరాబాద్,విశాలభారతి:** తట్టెపల్లి రిజర్వాయర్ను నిర్మిస్తే లక్షల ఎకరాల్లో భూములు పండించుకొని రైతులు జీవిస్తారని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు అంగోతు రాంబాబు నాయక్ అన్నారు. అంతేకాకుండా తట్టేపల్లిని మండల కేంద్రంగా గుర్తిస్తే వాటి చుట్టూ దాదాపు 12 గ్రామాలు 40,000 మంది అన్ని సౌకర్యాలతో జీవనం కొనసాగిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తట్టేపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ తట్టేపల్లి గ్రామంలో జ్ఞాన సమూహం అనే అంశంపై ప్రతాప్ సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రాంబాబు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ తట్టెపల్లి గ్రామం కర్ణాటక రాష్ట్రానికి బార్డర్లో ఉందని ఈ గ్రామానికి సరైన వసతులు లేవన్నారు. అత్యధికంగా గిరిజనులు జీవిస్తున్న ఈ ప్రాంతాన్ని మండల కేంద్రంగా గుర్తించాలని కోరారు. అప్పుడే మండల కేంద్రంగా విద్యాలయాలు కళాశాలలు పోలీస్ స్టేషన్ ఎమ్మార్వో ఎంపీడీవో కార్యాలయాలు వచ్చి ప్రజల జీవన విధానంలో మార్పు వస్తుందన్నారు. వైద్య సదుపాయం కోసం ఆసుపత్రి, పండించిన పంటకు మండల కేంద్రంలో మార్కెట్ వస్తాయని దీనితో ఇక్కడ ప్రజలు ఆనందంగా ఉంటారని అందుకు ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. అనంతరం పిల్లల చదువు, గ్రామీణ ప్రజల జీవనం, రాజకీయ ఓట్లు చైతన్యం గురించి వివరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధి రవి నాయక్, జిల్లా అధ్యక్షులు మోహన్, స్థానిక ఎస్సై కాశీనాథ్, గ్రామ పెద్దలు ప్రజలు విద్యార్థులు యువకులు పాల్గొన్నారు.

# రేవంత్ .. జై తెలంగాణ అన్నారా?

- రాష్ట్ర గీతం గురించి ఆయన మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది
- టీఎస్ పీఎస్సీ చైర్మన్
- మహేందర్ రెడ్డిని తొలగించండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**విశాలభారతి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏనాడైనా తన నోటి నుంచి జై తెలంగాణ అన్నారా? అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రేవంత్ ఎన్నడూ 'జై తెలంగాణ' అని కూడా అనలేదన్నారు. ''తెలంగాణ తల్లి విగ్రహం నాలా ఉందని సీఎం అంటున్నారు. నేనూ తెలంగాణ ఆడబిడ్డనే కదా?'' అని ప్రశ్నించారు. మహేందర్‌రెడ్డి పై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా ఆయనను తొలగించి, న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

'రాష్ట్రంలో కరెంట్ కోతలు మొదలయ్యాయి. హైదరాబాద్‌లో 34 గంటలపాటు విద్యుత్ కోతలు ఉంటున్నాయి. విద్యుత్ సంస్థల్లో ఏపీ వాళ్లను డైరెక్టర్‌లుగా నియమించారు. తెలంగాణ అసెంబ్లీకి ఏపీ అడ్వైజర్ ఎందుకు? గతంలో సలహాదారులే వద్దన్న రేవంత్ ఇప్పుడెలా నియమిస్తున్నారు? ఇదంతా రాజకీయ పునరావాసం కోసమే కదా?'' అని కవిత ప్రశ్నించారు.

# ఎమ్మెల్యేగా గెలవలేదు.. ఎమ్మెల్యేలనే తీసుకెళ్తారా?

- మా ఎమ్మెల్యేలను తీసుకెళ్లేంత మొగోళ్లు కాంగ్రెస్‌లో లేరు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**విశాలభారతి, హైదరాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డిపై బాల్కొండ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా గెలవని జగ్గారెడ్డి.. మా ఎమ్మెల్యేలనే తీసుకెళ్తారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మా ఎమ్మెల్యేలను తీసుకెళ్లేంత మొగోళ్లు కాంగ్రెస్‌లో లేరు అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి తమకేం అవసరం ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అంతర్యుద్ధం తప్పదని హెచ్చరించారు. అలవిగానీ హామీలు ఇచ్చి తమపై నెపం నెడుతున్నారని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్

శుక్రవారం,
09.02.2024
హైదరాబాద్



# సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

- తెలంగాణ గిరిజన సంఘంరాష్ట్ర కార్యదర్శి రమావత్ శ్రీరాం నాయక్

**మహబూబాబాద్ ,విశాల భారతి:** బంజారా గిరిజనుల పోరాట యోధుడు సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15 ను సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం గురువారం నాడు పట్టణంలోని జగన్నాథ భవన్లో బానోత్ వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం హాజరై ప్రసంగించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సేవాలాల్ జయంతి సెలవు దినంగా ప్రకటిస్తామని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సేవాలాల్ జయంతి ని అధికారికంగా నిర్వహించిన వాటికి సంబంధించిన నిధులను విడుదల చేయడంలో జాప్యం జరిగిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతి నిధులను 20 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన హక్కులను పూర్తిగా కాలరాస్తూ గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లో గిరిజనులకు అరకొర నిధులు కేటాయించి గిరిజనులకు అన్యాయం చేసిందని అన్నారు. దేశంలో కోట్లాదిమంది ఆదివాసి గిరిజనులు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న లక్షలాది ఎకరాల అటవీ భూములను బలవంతంగా లాక్కొని కార్పోరేట్లకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ నియమాల చట్టం చేసి గిరిజనుల హక్కులను కాలరాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాజ్యాంగం ప్రకారం గిరిజనులు పొందుతున్న హక్కులపై దాడిని తీవ్రతరం చేసి వాటిని కాలరాసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భూక్యా హరి, ఎం కిషన్, బి.రేద్యా, ప్రవీణ్,రోజా, అశ్వినీ, దేవా, గుగులోత్ రెడ్డి, సాయి కుమార్, పూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రతిభకు లింగభేదం లేదు

- ఉపాసన కామినేని
- ప్రారంభమైన గీతం వార్షిక విద్యార్థి ఉత్సవం 'ప్రమాణ'



**పటాన్‌చెరు,విశాలభారతి:**'ప్రతిభ గొప్పగా మాట్లాడుతుంది. అది బాహ్యమైన వాటి కంటే చాలా ముఖ్యమైనది. ఒక మహిళగా నేను నా సామర్థ్యాలతో శక్తివంతంగా భావిస్తున్నాను' అని అపోలో ఆస్పత్రుల సామాజిక సేవ (సీఎస్ఆర్) ఉపాధ్యక్షురాలు ఉపాసన కామినేని కొణిదెల అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో ప్రతియేటా నిర్వహించే మూడు రోజుల సాంకేతిక, సాంస్కృతిక (టెక్నో, కల్చరల్ ఫెస్ట్) పండుగను ఫిబ్రవరి 8న ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... ఆడ, మగ అనే లింగ భేదం లేకుండా, విశేషమైన విజయాల కోసం కృషిచేయాలని, తమ అత్యుత్తమ ప్రదర్శనకు తమను తాము సన్నద్ధం చేసుకోవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ ప్రారంభోత్సవంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న విశాఖ ఇండస్ట్రీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం వంశీకృష్ణ తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వ్యక్తులకు అందుబాటులో ఉన్న అపరిమితమైన అవకాశాలను ఎత్తిచూపారు. హద్దులను అధిగమించి ఆయా వ్యక్తుల అభిరుచులు, ఆసక్తులను అనుగుణంగా జీవితంలో రాణించాలని హితవు పలికారు. ఎలక్ట్రికల్, మేనేజ్మెంట్ నేపథ్యం ఉన్న తాను సౌరశక్తి రంగంలో ఉన్న అభిరుచితో సౌర పైకప్పును రూపొందించి, మేథో హక్కు (పేటెంట్) పొందానని, అలాగే ఎలక్ట్రికల్ వాహనాల రంగంలో ఉన్న ఆసక్తిమేరకు ఓ ఎలక్ట్రికల్ బైక్ ను రూపొందించిన మనదేశంలో ఆరు పేటెంట్లు పొందినట్టు చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, ప్రమాణ 2024 అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ పి.త్రినాథరావు, స్టూడెంట్ లెఫ్ట్ అధికారులు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నమూనా ఐక్యరాజ్య సమితి శిక్షణ కార్యశాల, ఆర్కిటెక్చర్ నమూనాల ప్రదర్శన, బ్యాండ్ల పోటీ, ట్రెజర్ హంట్, సంగీతం, నృత్య ప్రదర్శనలతో సహా అనేక ఆకర్షణీయమైన కార్యక్రమాలతో గీతం విద్యార్థులు ప్రమాణ ఫెస్టు వన్నెలద్దారు. ఈ పండుగతో పాటు సంప్రదాయ వస్త్రధారణ దినోత్సవాన్ని కూడా విద్యార్థులు నిర్వహించారు. సీతాకోక చిలుకల్లా కలియ తిరుగుతున్న విద్యార్థులతో గీతం ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. ప్రమాణ2024 అన్ని హద్దుల దాటిన ప్రతిభాస్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, సృజనాత్మకత, ఆవిష్కరణ, కలుపుకుపోయే వేడుకగా కొనసాగుతోంది.



# అనుమానంతో హత్య

- కేసుని చేదించిన కేతేపల్లి పోలీసులు
- మూడు సెల్ ఫోన్ లు, 2 బైక్ లు, సుత్తె స్వాధీనం

**నల్లగొండ, విశాలభారతి:** కేతేపల్లి మండలంఇప్పలగుడెం లో అనుమానంతో సైదులు అనే వ్యక్తిని హత్య చేసిన ఘటనలో కేతెపల్లి పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే కేతేపల్లి మండలానికి చెందిన మోదాల శ్రవణ్ కుమార్ కు చెందిన వ్యవసాయ భూమిలో మృతుడు సైదులు కూలి పని నిమిత్తం వెళ్ళేవాడు, అదే సమయంలో శ్రవణ్ భార్యతో సైదులు చనువుగా ఉండేవాడు. తన భార్యతో అక్రమ సంబందం కొనసాగిస్తున్నడని శ్రవణ్ కి అనుమానం కలిగి సైదులు పై కోపం పెంచుకొని ఎలాగైనా హతమార్చాలని కుడాకుడ గ్రామానికి చెందిన తన సొంత బామ్మర్ది ఐన బండారి వెంకటేశ్వర్లు సాయం కోరి సైదులు కదలికలు తెలుసుకోవ డానికి అదే గ్రామం లో బండారి సాయి సాయం తీసుకుని మృతున్ని ఇప్పలగుడెం ఐకెపి సెంటర్ కి తీసుకెళ్ళి అందరూ కలిసి మద్యం సేవిస్తూ మృతుడు సైదులు ని తన భార్య వెంట పడుతున్నావు ఎందుకని శ్రవణ్ కుమార్ అడగడతో మాట మాట పెరిగి శ్రవణ్ కుమార్, వెంకటేష్ తమతో పాటు తెచ్చుకున్న సుత్తెతో కుడి కన్ను పక్కన, కుడి చెవి, మెడపై, ఛాతిపై, కుడి కణతపై ఎడమ కాలు తొంటి పై బలంగా కొట్టడంతో సైదులు అక్కడికక్క డే మరణించారు. మృతుని కొడుకు చందు ఇచ్చిన పిర్యాదు మేరకు క్రైమ్ నం:15/2024 అ/సె 302 ఐపిసి సెక్షన్ కింద కేసు నమోదు చేసి విచారణ చేసి నిందితుల నుండి 3 సెల్ ఫోన్ లు, (2) మోటార్ సైకల్ లు, ఒక సుత్తెను స్వాదినం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కేసు చేదించిన శాలిగౌరారం సీఐ యస్. రాఘవ రావు, కేతేపల్లి యస్.ఐ శివ తేజ మరియు సిబ్బంది మహేష్,అజిత్ రెడ్డిని యస్.పి చందన దీప్తి ఐపిఎస్ అభినందించారు.




# నిబంధనలు పాటించండి

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం
- సీఐ శివ ప్రసాద్

**పినపాక, విశాల భారతి :** మానవ తప్పిదాలతో 91 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని రహదారి భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని సీఐ శివ ప్రసాద్ సూచించారు. గురువారం పినపాక మండలం తోగ్గూడెం గ్రామంలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ శివ ప్రసాద్ మాట్లాడుతూ రహదారి భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం డ్రైవర్లకు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు కంటి తనిఖీ చేసుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు వారికి స్పష్టమైన దృష్టి ఉండాలనే విషయాన్ని గుర్తు చేశారు.ఈ నెల 14 వరకు ఈ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. బైక్ నడుపుతున్న వారు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు నడుపకూడదని తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు గుర్తించి కారణాలు, తక్షణ నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యం, స్థానికులు, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.



# సిఎంఆర్ బియ్యం అందించాలి

- గడువులోపు ఇవ్వని మిల్లర్ల పై చర్యలు
- జిల్లా కలెక్టర్ యస్. వెంకటరావు

**సూర్యాపేట, విశాలభారతి :** ప్రభుత్వం నిర్దేశించిన ఈ నెల 29లోపు గడువులోపు 2022 - 23 సీఎంఆర్ అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు రైస్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్ లోని విసి హాలు నందు గురువారం ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో కలిసి కస్టమ్ మిల్లింగ్ రైస్‌పై సివిల్ సప్లయ్ అధికారులు, మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ అందించడంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ నెల 29 వరకు ప్రభుత్వం గడువు విధించిందని, ఈ లోపు పెండింగ్ బియ్యం ఎఫ్‌సీఐకి అందించాలని సూచించారు. 2022 - 23 వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 88శాతం సిఎంఆర్ లక్ష్యం అందుకున్నాయని, మరో 12శాతం మాత్రమే పెండింగ్ ఉన్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7 మిల్లుల్లో పెండింగ్ అధికంగా ఉన్నదని, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 29 నాటికి బియ్యం ఇవ్వని మిల్లులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ మేనేజర్ రాంపతినాయక్, , మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమనర్సయ్య, మిల్లర్లు,సిబ్బంది పాల్గొన్నారు.



# తాగునీటికి ముందస్తు చర్యలు

తహసీల్దార్ వీరభద్రప్రసాద్, ఎంపీవో వెంకటేశ్వరరావు

**పినపాక, విశాలభారతి :** వేసవి సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటికి ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందుగానే చర్యలు చేపడుతున్నట్లుగా జానంపేట పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, పినపాక తాసిల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలియజేశారు. పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు తో కలిసి గురువారం జానంపేటలో లీకేజీ పైప్ లైన్ పనులను పరిశీలించారు. స్వయంగా వారిరువురు దగ్గరుండి ప్రజలకు తాగునీరు ఇబ్బంది ఉన్న చోట ముందస్తుగానే చర్యలు చేపడుతున్నారు. పైప్ లైన్ లీకేజీ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో తాగు నీటి పైపులు లీకేజీ కావడంతో బురద, మట్టి కలవడంతో గతంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అది గమనించిన ప్రస్తుతం వచ్చిన ఎంపీఓ తానే స్వయంగా రంగంలోకి దిగి పనులు చేపిస్తున్నారు . గతంలో డయేరియా, ఇతర వ్యాధుల బారిన పడ్డామని స్థానికులు ఎంపీఓ కు తమ బాదలు తెలియజేశారు. సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేస్తే తన పరిధిలో సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక సెక్రటరీ నాగిని, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




# అందుబాటులో ఆర్కా రెనుల్ట్ ట్రైబర్ కార్

న్యూ వర్షన్ కారును ప్రారంభం

**సూర్యాపేట, విశాలభారతి :** సూర్యాపేట ప్రజలకు నూతన ఆధునిక వసతులతో ఆర్కా రెనుల్ట్ ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ రెనుల్ట్ ట్రైబర్ న్యూ వర్షన్ కార్ సామాన్యులకు అందుబాటులో ఉంటుందని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి. వెంకటయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనగాం ఎక్స్ రోడ్ వద్దగల రెనుల్ట్ ట్రైబర్,కార్ షోరూంను ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజల సర్వీస్ కోసం కోసం షోరూం ప్రారంభించడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు కంపెనీ ఇంకా మంచి న్యూ వర్షన్ తో మంచి సర్వీసులు అందించాలని కోరారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ భూపతి నారాయణ గౌడ్ మాట్లాడుతూ మార్కెట్ లోకి అనేక కంపెనీలకు సంబంధించిన కార్లు వస్తున్నాయి కానీ, సామాన్యులు కొనే విధంగా ధరలు లేవని, రెనాల్ట్ ట్రైబర్ కారు లో సెవెన్ సీటర్ కాకుండా కారు టాప్ ఎండ్ ధర పది లక్షల ముప్పై ఆరువేలు మాత్రమే ఉందని వేరే కంపెనీల సెవెన్ సీటర్ కార్లు 13 నుంచి 15 లక్షల వరకు ధరలు ఉన్నాయని మధ్యతరగతి కుటుంబానికి రెనాల్ట్ ట్రైబర్ కార్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కావున పట్టణ ప్రజలుఈఅవకాశాన్నివినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కస్టమర్ సర్వీస్ మేనేజర్ ఉదయ్ సింహ గౌడ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఎస్.కే. నజీర్, చిత్తరంజన్ దాస్, రవీందర్, రమేష్, భీమవరపు నరేష్, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రస్ట్ ఆధ్వర్యంలో బట్టలు అందజేత

**సూర్యాపేట, విశాలభారతి :**భావితరాలకు మన సనాతన ధర్మం తెలియపరచడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడమే లక్ష్యంగా సదాచారి ట్రస్టు సేవలందిస్తుందని ట్రస్టు కన్వీనర్ ఈగా దయాకర్ గుప్తా తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల సదాచార్ ట్రస్ట్ సేవ మందిర్ లో ఆర్థికంగా వెనుకబడిన సూర్యాపేటకు చెందిన దాచేపల్లి రఘు కుమార్, కవితల పుత్రిక గాయత్రి వివాహం నిమిత్తం సూర్యాపేటకు చెందిన ఈగ రామయ్య, సోమలక్ష్మి, ఈగ సతీష్ అనూషల దంపతుల సహకారంతో మంగళసూత్రం, మట్టెలు, నూతన వస్త్రములు అందజేసి మాట్లాడారు. శ్రీ వామనాశ్రమ మహా స్వామీజీ ఆశీర్వచనముతో వ్యవస్థాపక చైర్మన్ సాయి ఈశ్వర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఇప్పటివరకు తెలంగాణలో 85 మంది ఆర్థికంగా వెనుకబడిన వారికి పుస్తెలు మట్టెలు,నూతన వస్త్రములు ఇచ్చామని, అందులో ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 52 మంది వధువులకు అందజేసినట్టు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన హిందూమతం లోని కుటుంబాలకు చెందిన వారు వివాహం చేసుకొనే వదువు పెళ్లి పత్రిక, ఆధార్ కార్డు తెల్ల రేషన్ కార్డుతో ముందుగా సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాచా ట్రస్టు సభ్యులు మిర్యాల శివకుమార్, ఈగ విజయలక్ష్మి, మిర్యాల కవిత, మొలుగురి పద్మ, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్ మరణం తీరని లోటు

**పాలకుర్తి, విశాలభారతి:** మానవ హక్కుల కోసం తన జీవితకాలం శ్రమించిన మానవ హక్కుల కార్యకర్త నాస్తిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయ గోపాల్ మరణం సమాజానికి తీరని లోటు అని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు, బహుజన కులాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి రాజుల సాంబయ్య అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలిచారని, ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించేందుకు ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారని, సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు ఆయన వెల్లడించారు. 50 సంవత్సరాలకు పైగా నాస్తిక ఉద్యమాల్ని నిర్మాణం చేశారని, వివక్షత, అణిచివేతలపై అనగా



రిన జనాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని, త్యాగమయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని తెలిపారు. ఆయన కోరుకున్న సమాజం కోసం అంకితభావంతో పనిచేయడమే, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా అసలైన నివాళి అని పేర్కొన్నారు.



# ప్రత్యేక అధికారికి సన్మానం

**నూతనకల్, విశాలభారతి**:మండల పరిధిలోని బక్క హేమ్లా తండా గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ ఏఈ అశోక్ ను గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మూడ్ నెహ్రు నాయక్ గురువారం సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గడ్డమీద శ్రీనాథ్, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు నాగు నాయక్, అంగన్వాడీ టీచర్లు పాతులోత్ ఇందిరా,గుగులోత్ భారతి, ఆశా కార్యకర్త గుగులోతు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యట

**కురవి, విశాలభారతి:**లింగ్యా తండా గ్రామంలో ఈ నెల 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా రెండవ రోజు గురువారం కురవి మండలంలోని లింగ్యా తండాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులతో కలిసి పర్యటించారు. ముందుగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అదే గ్రామంలో పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలను చదివించారు. మరుగుదొడ్లను పరిశీలిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సెక్రెటరీ ని ఆదేశించారు. తదనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులను పలకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రాధాన్య అంశాలైన త్రాగునీరు, పారిశుధ్యం పై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట కురవి మండలంకు చెందిన ప్రత్యేక అధికారి నరసింహస్వామి, తాసిల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీవో సరస్వతి, పంచాయతీ సెక్రెటరీ శైలజ, గ్రామ సర్పంచ్ ధరావత్ రవి, పాఠశాల ఉపాధ్యాయులు రాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్




# రుణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- రుణాల మంజూరులో బ్యాంకర్లు ముందంజలో ఉండాలి
- పామాయిల్ పంట సాగు రైతులకు రుణాలు అందించాలి
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో పంట రుణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్.డి.ఎం. సి.హెచ్. బాపూజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన డి.సి.సి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్ అధికారులు అర్హులైన రుణ లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలని సూచించారు. జిల్లాలో పామాయిల్ పంట సాగు చేసే రైతులకు పంట రుణాలు అందించాలని అలాగే జిల్లాలో 3600 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగులో ఉందని ఈ సంధర్భంగా వివరించారు. త్వరలో అన్ని సెక్టార్ లలో పంట సాగు అనే అంశం పై రైతులు, బ్యాంకర్లతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 26 స్థానిక జూనియర్ కళాశాలలో ఫైనాన్స్ లిట్రాసి క్యాంప్ నిర్వహణ సందర్భంగా ఫిబ్రవరి 26న అలాగే మార్చి 3న కలెక్టరేట్ లో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం లో పంట ఋణాల్లో 2614.67 లక్ష్యం కాగా 9 నెలల్లో ఇప్పటివరకు 2567.55 కోట్ల రుణాలు అందించామని 98 శాతం వృద్ధి సాధించడం జరిగిందని అలాగే వ్యవసాయ టర్మ్ లోన్స్ లక్ష్యం 1363.93 కోట్ల లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 1416.43 కోట్ల రుణాలు అందించి 103.85 శాతం వృద్ధి సాధించామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్.బి.ఐ ఎల్.డి.ఓ వైభవ్ వ్యాస్, ఎస్ బి ఐ ఏ.జి.ఎం. జ్యోతి, నాబార్డ్ జి.ఎం. సత్యనారాయణ, ఏపీజీవీబీ ఏ.జి.ఎం. ఆశాలత, పి.డి. కిరణ్ కుమార్, ఎ డి ఎ రామారావు నాయక్, జి.ఎం. పరిశ్రమలు తిరుపతయ్య, డి ఈ వో అశోక్, సంక్షేమ అధికారులు జ్యోతి పద్మ, మాధవ రెడ్డి, శంకర్ వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.





# విద్యతోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యం

**మంచిర్యాల జడ్పీ సీఈవో కాకరాల నరేందర్**

**మందమర్రి టౌన్, విశాల భారతి.** విద్య ద్వారానే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని, ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదిగేందుకు విద్య తోడ్పడుతుందని మంచిర్యాల జడ్పీ సీఈఓ కాకరాల నరేందర్ అన్నారు. జిల్లా వయోజన విద్యాశాఖ అధ్వర్యంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల గౌతమి వారి సహకారంతో గురువారం పట్టణంలోని శ్రీపతి నగర్ లో ఏర్పాటుచేసిన వయోజన విద్య, కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వయోజనులతో అక్షరాలను దిద్దించి అక్షరబ్యాసం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో



ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో అత్యున్నతంగా రాణిస్తున్నారని ఆయన అన్నారు. మహిళలకు ఓపిక ఎక్కువ అని వారు అనుకున్నది సాధించేంత వరకు విశ్రమించరని అది వారి పట్టుదలకు నిదర్శనమన్నారు. సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే స్వయం ఉపాధి కల్పించుకోవాలని కుట్టు మిషన్ ద్వారా ఈ విద్యను నేర్చుకొని ఆర్థికంగా బలపడాలని ఆయన కోరారు. జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీరా పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ విద్యకు వయసుతో పని లేదని చదువుకునేందుకు వయోజనులు ముందుకు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి గాదరాజు కల్పన, మున్సిపల్ డిప్యూటీ ఈ.ఈ మిట్టపల్లి సుమతి, మెప్మా టి.ఎం.సి ఏనుగు రఘురామ్, డిస్ట్రిక్ట్ కోర్ టీమ్ యూత్, అండ్ స్పోర్ట్స్ లయన్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్, ప్రెసిడెంట్ ఆఫ్ లయన్స్ క్లబ్ మంచిర్యాల గౌతమి భీమా మల్లేశ్, ట్రెజరర్ లయన్ బొద్దున ఉదయ్ కిరణ్, జిల్లా కో ఆర్డినేటర్ లయన్ ఉస్కమల్ల రాజేంద్ర ప్రసాద్, ప్రెసిడెంట్ ఆఫ్ లయన్స్ క్లబ్ మంచిర్యాల సఖి, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

**రాజేష్ మీనా, ట్రైనీ ఐపీఎస్**

B సైబర్ జాగరుకత దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రం లో గల నారాయణ జూనియర్ కళాశాల నందు జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్, సూర్యాపేట పట్టణ పోలీసు అధ్వర్యంలో విధ్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ట్రైనీ ఐపిఎస్ అధికారి రాజేష్ మీనా గారు హాజరై మాట్లాడినారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజు, రోజుకు మితిమీరి పోతున్నాయని, వారి బారినుండి తప్పించుకోవాలంటే అవగాహనే ఒక్కటే మార్గమని, విధ్యార్థులు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఇంట్లో పెద్దవారిని అప్రమత్తం చేయాల అని సూచించారు, అనవసరంగా అత్యాశకు పోయి సైబర్ నేరాల బారిన పడవద్దని సూచించారు. ఆన్లైన్లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, డబ్బులు ఫ్రీ గా వస్తున్నాయి అంటే దాని వెనక ఏదో మోసపూరిత కుట్ర దాగి ఉందని గుర్తించాలన్నారు, సైబర్ నేరాలకు గురి అయినట్లైతే వెంటనే 1930 కాల్ చేసిగాని, NCRB (https://www.cybercrime.gov.in) పోర్టల్ నందు గాని రిజిస్టర్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డియస్పి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ లక్ష్మినారాయణ, టౌన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ ఐ కుషలవ, సైబర్ క్రైమ్ సిబ్బంది సైదులు, మహేష్, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.



# శివాలయంలో మండప నిర్మాణానికి దాత చేయూత

- రూ. 1 లక్ష స్టీల్ అందజేసిన ఎడ్ల మహేందర్‌రెడ్డి దంపతులు
- కృతజ్ఞతలు తెలిపిన సాగుబాయిగూడెం గ్రామస్తులు

**రామన్నపేట, విశాల భారతి:** మండలంలోని సర్నేని గూడెం గ్రామపంచాయతీ పరిధి లోని సాగు బాయి గూడెం శివాలయంలో కొత్త మండపం నిర్మాణానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎల్లంకి మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి శిల్ప దంపతులు చేయూతనందించారు. గురువారం వారు రూ. 1లక్ష విలువైన స్టీలును కొనుగోలు చేసి గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సాగు బాయి గూడెం గ్రామ ప్రజలు మహేందర్ రెడ్డి శిల్ప దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రభుత్వ భూములు మాయం

- చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలెం కోటి

**మణుగూరు, విశాలభారతి :** మండలంలోకొంతమంది విలేఖరులు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క దిద్దు కోవాలని అక్రమాలకు తెరలేపారు. జర్నలిస్ట్ ముసుగులో ఏమైనా చేయవచ్చు అని భూభాగ చట్టాలను పూర్తిగా కాలరాస్తూన్నారు. పాత్రికేయ వృత్తి కే చెడ్డ పేరు తెస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కేంద్రంలో మణుగూరు రెవెన్యూ పరిధి 138 సర్వే నంబర్ లో బడా బాబులు కొంతమంది వ్యాపారవేత్త చేతుల్లో కీలుబొమ్మలుగా మారి గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలెం కోటిఆరోపించారు. మణుగూరు పలు ఏరియా లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ముసుగులో లంబాడి సామాజిక వర్గం ప్రభుత్వ భూములు గిరిజన భూములు కాజేస్తూ బినామీగా వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. గిరిజనుల ముసుగులో ప్రభుత్వ టీచర్లుగా విధులు నిర్వహిస్తూ వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తూ అన్యాయం చేస్తారో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ డిమాండ్ చేస్తుందని అన్నారు. విలేకరి ముసుగులో ఒక గిరిజనేతర ఒక విలేకరు గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ వన్ బై సెవెంటీ యాక్ట్ 1/70 ను ఉల్లంఘిస్తూ ఎన్నో వ్యాపారాలు నిర్వహిస్తూ 5వ షెడ్యూల్డ్ భూభాగ చట్టాలను పూర్తిగా కాలరాస్తూ మణుగూరు మండలంలో బిల్డింగులు అమ్ముకొని మరియు బి టి పి ఎస్ వద్ద ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 853లో ప్లాట్లు కొని అమ్ముతూ రాజీవ్ గాంధీ నగర్ లో కూడా, 138 లో ప్రభుత్వ భూమిలో లక్షలాది రూపాయలతో తన అక్రమ సంపాదన తో ప్లాట్లు కొని అమ్ముతూ వన్ ఆఫ్ సెవెంటీ 1/70ని పూర్తిగా ఉల్లంఘించచారని అన్నారు. అలాగే రాజీవ్ గాంధీ నగర్ లో అక్రమంగా చట్టాలకు వ్యతిరేకంగా మూడంతస్తుల బిల్డింగు కట్టారని, అయన రాజభోగం అనుభవిస్తున్నారని, గిరిజనుల పై అవాకులు చవాకులు పేలుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. పైన తెలిపిన విషయాల పై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలెం కోటి మరియు మండల అధ్యక్షులు పడిగ నారాయణ, కొమరం సైదులు మడకం శ్రీను, తుమ్మ రాశి సుతారి వెంకన్న, కొమరం రామకృష్ణ, అడిగా శ్రీను, సుజాత, సుభద్ర, అన్వేషిని తదితరులు పాల్గొన్నారు.

# గురుకులలో ప్రవేశాలకు గడువు పెంపు



**జహీరాబాద్, విశాలభారతి:** అల్గోల్ మైనార్టీ బాలుర పాఠశాలలో మరియు కళాశాల యందు వచ్చే విద్యా సంవత్సరానికి గాను 20242025 సంబంధించి ఐదవ తరగతి లో ప్రవేశాలకు మరియు 6,7,8 తరగతులలో మైనార్టీ బ్యాక్లాగ్ ఖాళీలకు అదేవిధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ మరియు బైపీసీ గ్రూపులకు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తుల గడువు తేదీని ఫిబ్రవరి 15 వరకు పొడిగించబడిందని ప్రిన్సిపాల్స్ జె. రాములు, కే.ఎస్. జమీల్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్గోల్ మైనారిటీ బాలుర కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (సీవోఈ) లో నీట్ మరియు ఎన్డీఎ కోర్సుల్లో చేరుటకు అర్హత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ద్వార విద్యార్థుల ను ఎంపిక చేయడం జరుగుతుంది. 5వ తరగతి నందు మైనార్టీ సీట్లు 51, క్రిస్టియన్ 5, జైన్, పార్సి, బుద్ధులు మరియు సిక్కులు 4 సీట్లు మరియు నాన్ మైనార్టీ విద్యార్థులకు మొత్తం 20 సీట్లు (బీసీ 10, ఎస్సీ 05, ఎస్టీ 03, ఓసీ 02) కలవు. ఈ ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా (www.tmreis. telangana.gov.in) లేదా TMREIS మొబైల్ యాప్ ద్వారా గాని నేరుగా పాఠశాల లేదా కళాశాలలకు వెళ్లి ఫిబ్రవరి 15 తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.




# గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

**గరిడేపల్లి సబ్ ఇన్స్పెక్టర్ పి. వెంకట్ రెడ్డి**

**గరిడేపల్లి, విశాలభారతి:** డ్రగ్స్, గంజాయి నిర్మూలన మన అందరి బాధ్యత అని గరిడేపల్లి ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రం తో పాటు, కీతవారి గూడెం, పొనుగోడు గ్రామాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నుండి మన పిల్లలని మన సమాజాన్ని కాపాడుకుందామని, డ్రగ్స్ & గంజాయి నిర్మూలన మనందరి బాధ్యత అని అన్నారు. డ్రగ్స్, గంజాయి వినియోగం గురించి వాటి వల్ల సంభవించే అనర్థాల గురించి అవి ఎంత ప్రమాదకరమైనవో వివరించారు. డ్రగ్స్ వ్యాపారం నిర్వహించిన, వినియోగించిన, రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.



# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**మందమర్రి టౌన్, విశాల భారతి:** సింగరేణి ప్రాంతం లోని స్థానికులకే సింగరేణిలో 80 శాతం ఉద్యోగాలు ఇవ్వడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చెన్నూరు శాసన సభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, జిల్లా నాయకులు సోత్కు సుదర్శన్, పుల్లూరి లక్ష్మణ్ లు మాట్లాడుతూ సింగరేణిలో స్థానికులకు 80 శాతం ఉద్యోగ కల్పనకు కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ యువ నాయకుడు గడ్డం వంశీకృష్ణ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నేరువట్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గడ్డం రజిని, నాయకులు కనకం రాజు, దుర్గం ప్రభాకర్, ఎండి సుకూర్, బుర్ర ఆంజనేయులు గౌడ్, బూడిద శంకర్, వడ్లూరి సునీల్ కుమార్, ఆకుదారి శ్రీనివాస్, ఎర్ర రాజు, రాయబారపు కిరణ్, గడ్డం శ్రీనివాస్, రెడ్డి ఐలయ్య, శేఖర్, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సి.ఐ.)గా సైదయ్య భాధ్యతలు.




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO)గా S, సైదయ్య భాధ్యతలు స్వీకరించారు. రాచకొండ కమీషనర్ ఉత్తర్వులు మేరకు ఇప్పటి వరకు యాచారం పోలీసు స్టైఐన్ SHO గా విధులు నిర్వహిస్తున్న సైదయ్య అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ కు బదిలీపై వచ్చి భాద్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు.





# గృహ జ్యోతి పథకం ప్రక్రియ ప్రారంభం

**జహీరాబాద్ విద్యుత్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు కేంద్రం**

**జహీరాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహ జ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పథకంలో భాగంగా తమ తమ సర్వీసు నంబరు, రేషన్ కార్డు నంబరు, ఆధార్ కార్డు నంబరు, ఫోన్ నంబర్ మరియు ప్రజాపాలన అప్లికేషన్ నంబర్లను తేది : 09.02.2024 నుండి 12022024 వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జహీరాబాద్ పట్టణములోని విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందజేయగలరని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ విద్యుత్తు శాఖ అధికారులు గురువారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. అదేవిదంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కౌంటర్లు తెరిచి ఉంటాయని వారు అందులో పేర్కొన్నారు.

# నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** క్రషర్ మిషన్ల యాజమాన్యాలు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఆర్డీవో రఘునందన్‌గౌడ్ హెచ్చరించారు. అధిక లోడ్లు, దుమ్ము, దూళితో ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. క్రషర్ మిషన్ల యాజమాన్యాలకు ఇప్పటికే సెక్షన్ 199కింద నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. క్రషర్ యాజమాన్యాలను గతం నుంచి హెచ్చరిస్తున్నా పద్ధతి మార్చుకోవడంలేదని మండిపడ్డారు. ఇకపై అధిక లోడ్‌తో వెహికిల్స్ పట్టుబడితే వెంటనే సీజ్ చేసి, కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే ప్రజల సౌకర్యార్థం మన్నెగూడలో అధునాతన సౌకర్యాలతో ఆర్డీఏ ఆఫీసు భవనాన్ని నిర్మించుకున్నట్లు తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భవన ప్రాంగణంలో మంచినీటి ఆర్వో ప్లాంట్, టాయిలెట్స్ నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చినట్లు తెలిపారు. ఆర్డీఏ ఆఫీసుకు వచ్చే వినియోగదారులకు మంచి సేవలు అందించడమే తమ లక్ష్యమని రఘునందన్‌గౌడ్ అన్నారు.



# జీడిపల్లి జాతరను సందర్శించిన గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి, విశాల భారతి:** మండల పరిధిలోని జీడిపల్లి గ్రామంలో శ్రీ హజ్రత్ ఖాజా బందేనవాజ్ 63వ ఉర్సు జాతరను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గురువారం హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్పన కృష్ణయ్య, ఎం.డి ఖాజామోనుద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూరమళ్ళ సుభాష్, తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, ముత్యాల రమేష్, నరేష్, చీమల్ల సతీష్, సుమన్, గణేష్, కిషోర్, విష్ణు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు

# వృక్ష సంపదను కాపాడాలి

**ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రో.లింబాద్రి.**




**సికింద్రాబాద్, విశాలభారతి:** అంతరించిపోతున్న జాతి మొక్కలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. ఆర్. లింబాద్రి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగం వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఈ వేడుకల్లో భాగంగా 'అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ సైన్సెస్ ఫర్ సస్టెయినబుల్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయ భవనంలో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రొ. లింబాద్రి హాజరయ్యారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ. పర్యావరణ పరిరక్షణలో ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగం కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. వర్సిటీ క్యాంపస్లో ఆక్సిజన్ పార్కు అభివృద్ధి చేయడంలో విభాగం ఎంతో కష్టపడిందని గుర్తు చేశారు. ఆ పార్కులో నాటిన మొక్కలపై సైటేషన్ను ఏర్పాటు చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి "అనుగుణంగా కాలుష్యం పెరిగిపోతోందని, మొక్కలను ఎక్కువగా నాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రజలందరికీ ఆహారం అందాలంటే క్రాప్ రొటేషన్ చేయాలని అన్నారు. వ్యాధులను తట్టుకోగలిగే వంగడాలను తయారు చేయాలని పరిశోధకులకు సూచించారు. ఇక్రిశాట్ గ్లోబల్ రీసర్చ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ సీన్ మాయెస్ "ప్లాంట్ సైన్స్ ఫర్ సస్టెయినబుల్ ఫ్యూచర్' అనే అంశంపై కీలకోపన్యాసం వెలువరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు, మార్కెట్ అంశాల ప్రధాన ప్రాతిపదికగా పరిశోధనలు విస్తృతమవ్వాలని అభిప్రాయపడ్డారు. కష్టాల కడలిలో కన్నీటి సేద్యం చేస్తున్న రైతన్నకు ఆపన్నహస్తం అందించినపుడే మపరిశోధనలకు సార్థకత అని అన్నారు. సాగులో లేని ప్రాధాన్యమున్న పంటలను సాగులోకి తీసుకురావడం ద్వారా రైతాంగానికి మేలు చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. రవీందర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. వీరయ్య, డీన్ ప్రొ. కరుణసాగర్, విభాగం హెడ్ ప్రొ. బి. రమాదేవి, బీవోఎస్ చైర్మెన్ ప్రో. సబితా రాణి, ప్రొ. కమలాకర్, ప్రో. శైలజా, డా. నాగేశ్వరరావు, డా. కిరణ్ కుమార్, డా. సుమన్ కుమార్, ప్రొపెసర్స్, పీజీ, పీహెచ్డీ విద్యార్థులు పాల్గొన్నారు.



## పిల్లలను అప్రమత్తంగా ఉంచాలి

**ఎన్ఎస్యుఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రెహమాన్**

**బాల్కొండ, విశాల భారతి:** పిల్లలను కిడ్నాపర్ల బారి నుండి కాపాడవలసిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఉందని ఎన్ఎస్యుఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రెహమాన్ అన్నారు. భీమ్ గల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో వరుసగా జరుగుతున్న కిడ్నాప్ ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయని అన్నారు. గడిచిన వారం రోజుల్లో ముగ్గురు చిన్నారుల కిడ్నాప్ సంఘటనలు జరగడం భయాందోళనలకు గురి చేస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు అపరిచితులతో మాట్లాడవద్దని, వారు ఇచ్చిన తిను బండారాలు తినకూడదని సూచించాలని అన్నారు. అలాగే పాఠశాలలో చిన్నారులకు ఉపాధ్యాయులు కిడ్నాప్ లకు సంబంధించిన విషయాల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ బాల్కొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మొండి దినేష్, నాయకులు అభి, మహేశ్వర్, సంపత్, విష్ణు, సాయి, రాజు, శ్రీశాంత్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎంపీటీసీను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**అక్కన్నపేట, విశాల భారతి :** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జె) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వాసాల ఐలయ్య ఆరోగ్య పరిస్థితి ఏమి బాగోలేదు. దీంతో టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్యలు వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడద్దని ధైర్యంగా ఉండాలని ఐలయ్యకు ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా ముందుకు వెళ్లడం సంతోషంగా ఉందని ఐలయ్య కాంగ్రెస్ నాయకులతో సంతోషంగా చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తోనే హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు బండి కుమార్, బుర్ర ప్రభాకర్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ బానోతు భాస్కర్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెన్న రాజు,వాసాల లింగయ్య, గుగులోతు రాజు నాయక్, బైరగోని శ్రీనివాస్ యాదవ్, తాజా మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్ అభివృద్ధి కి కృషి చేస్తా

**కార్పొరేటర్ హమీద్ పటేల్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** కొండాపూర్ డివిజన్ అభివృద్ధి కి ఎల్లవేళలా కృషి చేస్తానని కార్పొరేటర్ హమీద్ పటేల్ అన్నారు.గురువారం కొండాపూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనుల తీరును పర్యవేక్షించిన స్థానికులతో కలిసి పర్యటించి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్క కాలనీ, బస్తీ సమూల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని అన్నారు. డివిజన్ పరిధిలోనీ ఓయూ, ప్రొఫెసర్ కాలనీలో 80 లక్షలు అంచనా వ్యయంతో, ప్రేమ్ నగర్ ఏ బ్లాకు డంపింగ్ ఏరియాలో 23 లక్షలు అంచనా వ్యయంతోనూ జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జలమండలి అధికారి మేనేజర్ విక్రమ్ రెడ్డి , స్థానిక నాయకులు సయ్యద్ ఉస్మాన్, మాక్బుల్ చిచ్చా, అజ్జు, మోబిన్, నియామత్ తదితరులు పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లి అభివృద్ధికి కృషి చేస్తా

**వి.జగదీశ్వర్ గౌడ్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రతి డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ కాలనీ అసోసియేషన్ సభ్యులు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించి,స్థానికంగా ఉన్న మంచి నీటి,డ్రైనేజీ సమస్యలపై వారితో కలిసి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ సమీక్షించారు. ఇందులో భాగంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి వినతిపత్రం ద్వారా తీసుకొచ్చారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అందుకు అవసరమైన పనులను త్వరలోనే చేపట్టి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానికులు జయచందర్ రెడ్డి,సతీష్, రామకృష్ణ,రాములు,శ్రీధర్ బాబు,జనార్ధన్ రావు,కృష్ణ కుమార్,బల్వంత్ రెడ్డి, చంద్రశేఖర్,శ్రీనివాసరావు,వెంకటేశ్వర రావు,రాజేష్ తదితరులు పాల్గొన్నారు..



## దివ్యాంగులకు భవనం ఏర్పాటు చేయండి

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దివ్యంగులకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని శేర్లింగంపల్లి దివ్యాంగుల సంఘం గురువారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ను కలిసి అభివృద్ధి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందుకు అవసరమైన నిధులను కేటాయించి దివ్యాంగుల భవనాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అశోక్ కుమార్,షాకిర్,శ్వేతా, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి 20% శాతం నిధులు కేటాయించాలి

**ABVP దిల్సుఖ్నగర్ కన్వీనర్ కుంచాల సాయిరాం**




**ఎల్బీనగర్, విశాలభారతి:** గతంలో ఉన్న ప్రభుత్వం విద్యారంగానికి 10%శాతం నిధులు ఉంటే దాన్ని 6.24% శాతంకి తగ్గించేసి విద్యార్థుల గొంతు కోశారు, అలాగే రాష్ట్రంలో అనేక ప్రభుత్వ హాస్టల్లలో కనీస వసతులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లకు పక్కా భవనాలు లేక విద్యార్థులు అద్దె భవనాల్లో వసతి ఉంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక యూనివర్సిటీలల్లో టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు.కాబట్టి ఇప్పుడు ఉన్న ప్రభుత్వం అయిన విద్యారంగానికి కనీసం 20%శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని అన్నారు.




## పీర్జాదిగూడలో అవిశ్వాసానికే కార్పొరేటర్లు మొగ్గు.

- **మేయర్ కు తప్పని గండం.**
- **పారని పాచికలు**
- **మల్లారెడ్డి సహకారం నిల్**



**మేడిపల్లి,విశాలభారతి:** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ లో బీఆర్ఎస్ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డికి అవిశ్వాస గండం తప్పేటట్టు లేదు మేయర్ పై అవిశ్వాసం పెట్టడానికే నిశ్చయించుకున్నట్లు సమాచారం స్వంత పార్టీ కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్దమై గత పది రోజుల నుండి టూర్ బాట పట్టారు. దానిని నిలువరించేందుకు మేయర్ జక్క వేసిన ఎత్తులు పారడం లేదు. కార్పొరేటర్ల మనసులో విశ్వాసం కోల్పోయిన జక్క కొత్త నాటకానికి తేరదించారు.

**మల్లారెడ్డి సహకారం నిల్..**

మేడ్చల్ రాజకీయాలలో సంచలనాత్మకంగా నిలిచిన మాజీ మంత్రి మల్లారెడ్డి సాదారణ ఎన్నికల లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలయ్యాక ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. తన స్వంత నియోజకవర్గంలోని వివిధ కార్పొరేషన్లు,మునిసిపాలిటీలలో స్వంత పార్టీ ప్రజాప్రతినిధుల మద్య రోజు రోజుకు పెరిగి పోతున్న అసమ్మతిని నిలువరించే ప్రయత్నం చేయకపోవడం చూస్తుంటే మీరు మీరు తన్నుకు చావండి నాకేమి సంబంధం లేదు అనే రీతిలో ఆయన వ్యవహారం ఉందని బీఆర్ఎస్ పార్టీ వర్గాలే గుసులాడుతున్నాయి.ఏదిఏమైనా రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామల నేపథ్యంలో మల్లారెడ్డి వ్యవహారం అచితూచి మాట్లాడే పరిస్థితికి మారిందనే చెప్పాలి.పీర్జాదిగూడ కార్పొరేషన్ లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆయన ఏ మాత్రం ప్రయత్నం చేయకపోవడం అసమ్మతి కార్పొరేటర్లతో గోవా టూరేసినా అసమ్మతి తగ్గించకపోవాడం చూస్తుంటే మేయర్ వెంకట్ రెడ్డిపై మల్లారెడ్డికి కూడా నమ్మకం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

**అవిశ్వాసం పక్క.**

కార్పొరేటర్ల మనోభావాలను దెబ్బ తీసిన మేయర్ వెంకట్ రెడ్డి ఎన్ని ఎత్తులు పై ఎత్తులు వేసిన అవిశ్వాసం తప్పదని మేయర్ వ్యతిరేక వర్గంగా ఉన్న కార్పొరేటర్లు బల్లగుద్ది చెప్తున్నారు.మేయర్ వెంకట్ రెడ్డి అవినీతి అక్రమాలపై మా పోరాటం అగదు ఆయనను మేయర్ పీఠం నుండి దించేంతవరకు ఆయనపై మా పోరాటం ఆగదు అంటు కార్పొరేటర్లు చెప్తున్నారు.




## ఫీజుల నియంత్రణ చట్టం తీసుకరావాలి

- **ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి**
- **జాజుల లింగం గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి :** తెలంగాణలోని ప్రైవేట్ యూనివర్సిటీలో ఫీజుల నియంత్రణ చట్టం తెచ్చి ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని అఖిల భారత సాంకేతిక విద్య మండలిలో అధికారులను కలిసి పిర్యాదు చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. అనంతరం ప్రైవేట్ యూనివర్సిటీలో ఫీజులు నియంత్రణ లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్టు ఫీజులు వసూలు చేస్తున్నారని, అంతే కాకుండా ప్రైవేట్ యూనివర్సిటీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపరచాలని యూజీసీ నిర్ణయించిన తెలంగాణలోని ప్రైవేట్ యూనివర్సిటీలో రిజర్వేషన్ అమలు చేయడం లేదన్నారు. విద్య అనేది సేవా మార్గమని మరిచి విద్య ముసుగులో తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేస్తూ పేదల రక్తాన్ని జలగల్లా పీల్చుకుతింటున్నారు. వర్సిటీలో రిజర్వేషన్లు అమలు చేయకపోవడం వలన ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు విద్య అనేది అందని ద్రాక్షగా మారింది. రాష్ట్రంలోని ప్రైవేట్ వర్సిటీలో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు అర్హతలు ఉన్న సిబ్బంది లేకుండానే విద్యను అందిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో ప్రైవేట్ యూనివర్సిటీలు ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తూ అడ్మిషన్ల దగ్గర నుంచి ఫీజుల ఖరారు పరీక్షలు నిర్వహణవంటి అనేక అంశాలు సొంత షెడ్యూల్ ని అమలు చేస్తూ పేదవానికి విద్యను అందని ద్రాక్షగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని విద్యార్థులకు న్యాయం జరిగేలా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేసి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. ఈ కార్యక్రమంలో మహేశ్ యాదవ్, వంశీ ముదిరాజ్ పాల్గొన్నారు.




## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**కార్పొరేటర్ లచ్చిరెడ్డి**

**ఎల్బీనగర్ విశాలభారతి:** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలను సందర్శించి పారిశుద్ధ కార్మికుల పనితీరును డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి రోజూ రహదారులు, మురుగు కాలువలను,కాలనీ రోడ్లను శుభ్రం చేయాలని, రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని,ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పించాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి SS అజీమ్ ఉద్దీన్, SFA బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## జంతర్ మంతర్ వద్ద బీసీల భారీ ధర్నా.

**హాజరై మాట్లాడిన బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి.**

**న్యూఢిల్లీ,విశాలభారతి:** బీసీలకు కుల జన గణన జరపాలని ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ హనుమంతరావు, సిపిఐ నాయకులు రామకృష్ణ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ తో కలిసి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి ఫలాలు బీసీలకు అందాలంటే దేశవ్యాప్తంగా కుల గణన తోపాటు జన గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి వీలుగా ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. బీసీల సంఖ్య ఎక్కువగా ఉన్న చట్టసభల్లో ప్రాధాన్యత తక్కువ ఉందని అందుకు బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చట్టసభల్లో 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలానే నామినేటెడ్ పోస్టులు తో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహ చారి, తాటికొండ శ్రీనివాస్ చారి తో పాటు సుమారు 500 మంది బీసీ నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.



# 1ఘనంగా "ట్రూ లవర్" సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్

మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి లీడ్ రోల్స్ లో నటిస్తున్న సినిమా "ట్రూ లవర్". ఈ సినిమాను మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్ పీ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ పై నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మించారు. ఓ విభిన్న ప్రేమ కథగా దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ రూపొందించారు. ఈ సినిమాను డైరెక్టర్ మారుతి, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమాను ఈ నెల 10వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకువస్తున్నారు. ఇవాళ "ట్రూ లవర్" సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎస్ కేఎన్ మాట్లాడుతూ ఈ సినిమా తమిళ ప్రీమియర్స్ చూసిన వాళ్లు ఇటీవల కాలంలో ఇలాంటి మంచి లవ్ స్టోరి రాలేదని చెబుతున్నారు. తెలుగు ఆడియెన్స్ కు కూడా ఈ సినిమా బాగా నచ్చుతుంది. ఇప్పటి దాకా "ట్రూ లవర్" నుంచి రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ వంటి కంటెంట్ మొత్తానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ శనివారం సినిమాను థియేటర్స్ లోకి తీసుకొస్తున్నాం. రేపు రాత్రి 9 గంటలకు సెలబ్రిటీలు, మీడియాకు కూకట్ పల్లి విశ్వనాథ్ థియేటర్ లో షో వేస్తున్నాం. మరికొన్ని థియేటర్స్ లో పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. ఈ నెల 9వ తేదీ అనేది సోలోగా ఈగిల్ దే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వివేక్ గారికి, విశ్వప్రసాద్ గారికి చెప్పి వారి అనుమతితోనే 10న "ట్రూ లవర్" రిలీజ్ కు రెడీ అయ్యాం. వాలెంటైన్ డే విన్నర్ అంటే ప్రేక్షకుల మనసుల్ని గెల్చుకుంటుందని చెప్పా. బేబి హిందీ రీమేక్ లో నేను నటిస్తున్నాను అనే రూమర్స్ లో నిజం లేదు. అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ నేను ఈ సినిమా ఫస్ట్ టైమ్ చూసినప్పుడు ఎలాంటి ఎగ్జైట్ మెంట్ కలిగిందో తమిళ ప్రీమియర్స్ తర్వాత సోషల్ మీడియాలో వస్తున్న పోస్ట్ లు చూస్తున్నప్పుడు అంతే సంతోషం కలిగింది. "ట్రూ లవర్" సినిమా కథను దర్శకుడు చాలా జెన్యూన్ గా తెరకెక్కించాడు. చాలా డీప్ గా థింక్ చేసి స్క్రిప్ట్ చేశాడు. డైరెక్టర్ గా ప్రభురామ్ వ్యాస్ టాలెంట్ ఇంప్రెస్ చేస్తుంది. అబ్బాయిలు, అమ్మాయిలే కాదు ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా ఇది. ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా ఎక్కడా ఇబ్బంది పడకుండా మూవీ చూడొచ్చు. ఈ సినిమాతో ఈ వాలెంటైన్స్ డే మర్చిపోలేకుండా ఉంటుందని చెప్పగలను. తెలుగు ఆడియెన్స్ అంతా "ట్రూ లవర్"ను ఇష్టపడతారని ఆశిస్తున్నాం. తెలుగులో ఇప్పటివరకు ఇలాంటి పాయింట్ తో సినిమా రాలేదు. తను ప్రేమించిన అమ్మాయి వేరే వారితో ఫ్రెండ్షిప్ చేస్తూ తనను అవైడ్ చేస్తే ఆ పెయిన్ ఎంతగా ఉంటుందో ఊహించుకోవచ్చు. దీన్ని దర్శకుడు చాలా ఆక్యురేట్ గా రూపొందించాడు అనిపించింది. అన్నారు.



# ఆలియా టాలీవుడ్‌కి చిక్కదు దొరకదు

చూస్తుంటే ఆలియా భట్ ఇప్పట్లో తెలుగు సినిమాల్లో నటించే అవకాశం లేదని తాజా సన్నివేశం చెబుతోంది. ఇంతకుముందు ఆర్.ఆర్.ఆర్ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రంలో ఆలియా నటించింది. ఆ తర్వాత ఎన్టీఆర్ లేదా చరణ్ సరసన నటించే అవకాశం ఉందని కథనాలొచ్చాయి. బుచ్చిబాబుతో చరణ్ సినిమాకి ఆలియానే కథానాయికగా ఎంపిక చేసుకున్నారని కూడా కథనాలు వైరల్ అయ్యాయి. కానీ ఇవేవీ నిజాలు కావని తేలిపోయింది. అలియా భట్ తదుపరి ఏడాది పాటు ఎవరికీ కాల్షీట్లు కేటాయించలేని స్థితిలో ఉంది. రణబీర్ కపూర్ - విక్కీ కౌశల్ లతో కలిసి ఆలియా తదుపరి సంజయ్ లీలా భన్సాలీ ఇతిహాసం 'లవ్ అండ్ వార్' కోసం క్రిస్మస్ 2025 వరకు వారి క్యాలెండర్‌లను బ్లాక్ చేసుకుందని తెలిసింది. 24 జనవరి 2024న లెజెండరీ ఫిల్మ్ మేకర్ సంజయ్ లీలా భన్సాలీ తన తదుపరి భారీ చిత్రం 'లవ్ అండ్ వార్' ప్రకటనతో పరిశ్రమలో షాక్ వేవ్‌లను పంపారు. ఈ సినిమా కోసం చాలా ఉత్సాహంగా అభిమానులు వేచి చూస్తున్నారు. వారిలో కోలాహలం అంతా ఇంతా కాదు. రణబీర్ కపూర్, అలియా భట్ సహా కీలక తారలు ఇందులో నటించనున్నారు. విక్కీ కౌశల్ లాంటి ప్రతిభావంతుడు ఇందులో నటించనుండడం ఆసక్తిని పెంచుతోంది. సంజయ్ లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' గ్రాండ్ టైటిల్ పోస్టర్‌తో అధికారికంగా ఖరారైంది. ఈ పోస్టర్ సినిమా గ్రాండియారిటీని ప్రదర్శించడమే కాకుండా ప్రధాన తారాగణం సంతకాలను కూడా తెరపై చూపిస్తోంది. లవ్ అండ్ వార్ కోసం సంజయ్ లీలా భన్సాలీ-రణబీర్ కపూర్ కాంబినేషన్ పై అంచనాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం క్రిస్మస్ 2025న థియేటర్‌లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# మార్చి 1న చారి 111 విడుదల



'వెన్నెల' కిశోర్ హీరోగా నటిస్తున్న సినిమా 'చారి 111'. టీజీ కీర్తి కుమార్ దర్శకుడు. సుమంత్ హీరోగా 'మళ్ళీ మొదలైంది' వంటి ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ తీసిన తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ నిర్మిస్తున్నారు. ఇందులో సంయుక్తా విశ్వనాథన్ కథానాయిక. మురళీ శర్మ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మార్చి 1న థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాత వెల్లడించారు. 'చారి 111' రిలీజ్ డేట్ పోస్టర్ ఇంట్రెస్టింగ్‌గా, ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ కలిగించే విధంగా డిజైన్ చేశారు. థియేటర్లలోకి గూఢచారిగా ప్రేక్షకుల్ని నవ్వించడానికి 'వెన్నెల' కిశోర్ వస్తున్నట్లు ఉంది. ఈ జనరేషన్ కమెడియన్లలో తనకంటూ సపరేట్ కామెడీ స్టైల్ క్రియేట్ చేసుకున్న ఆయన... ఈ సినిమాలో ఏ విధంగా నవ్విస్తారో థియేటర్లలో చూడాలి. చిత్ర దర్శకుడు టీజీ కీర్తి కుమార్ మాట్లాడుతూ ''ఇదొక స్పై యాక్షన్ కామెడీ సినిమా. సిల్లీ మిస్టేక్స్ చేసే ఒక స్పై పెద్ద కేసును ఎలా సాల్వ్ చేశాడనేది సినిమా. వెన్నెల కిశోర్, సంయుక్తా విశ్వనాథన్ స్పై రోల్స్ చేశారు. వాళ్లకు బాస్ రోల్ మురళీ శర్మ చేశారు. కథలో ఆయనది కీలక పాత్ర'' అని చెప్పారు. చిత్ర నిర్మాత అదితి సోనీ మాట్లాడుతూ ''స్పై జానర్ సినిమాల్లో 'చారి 111' కొత్తగా ఉంటుంది. 'వెన్నెల' కిశోర్ గారి నటన, టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం సినిమాకు హైలైట్ అవుతాయి. మార్చి 1న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. అతి త్వరలో ట్రైలర్, పాటలు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా 'చారి 111' పాటలు విడుదల కానున్నాయి.



# 'కథా కేళి' షూటింగ్ పూర్తి

సతీశ్ వేగేశ్న చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తుంటుందన్న సంగతి తెలిసిందే. ఆయన 'కథా కేళి' చిత్రంతో తన కొడుకు యశ్విన్‌ను హీరోగా లాంచ్ చేయబోతోన్నారు. చింతా గోపాలకృష్ణా రెడ్డి సమర్పణలో శతమానం భవతి ఆర్ట్స్ బ్యానర్‌పై సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఈ మూవీ టీజర్‌ను దిల్ రాజు చేయగా.. అది ఎంతగానో వైరల్ అయింది. ఇక తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్డేట్ వచ్చింది. సతీశ్ వేగేశ్న ఈ మూవీ షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రయూనిట్ షూటింగ్‌కు ప్యాకప్ చెప్పేసింది. సినిమా షూటింగ్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ఇక చివరి రోజున ఇలా చిత్రయూనిట్ అంతా కూడా సందడిగా కనిపించారు. ఈ మేరకు మేకర్స్ షేర్ చేసిన ఫోటోల్లో చిత్రయూనిట్ అంతా కనిపిస్తోంది.

# పల్నాడు నుంచి బిజేపిలోకి ప్రముఖ నిర్మాత అరంగేట్రం



ప్రధాని మోడీ చేస్తున్న వివిధ కార్యక్రమాల వల్ల ఆకర్షితులై కేంద్ర, రాష్ట్రాలలో ఆయన చరిష్మా పెరుగుతూ పోతుంది. ఆ కోవలోనే బిజేపి కి ఆంధ్ర ప్రదేశ్ లో పెరుగుతున్నఆదరణ తరుణం లో తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితుడైన ప్రముఖ సినీ నిర్మాత , పారిశ్రామిక వేత్త చింతపల్లి రామారావు త్వరలో బిజేపి లోచేరనున్నరని విశ్వసనీయ సమాచారం. గత రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో నిర్మాత గా తన శైలిని చూపించిన రామారావు పారిశ్రామిక వేత్తగా కూడా పలు వ్యాపారాలలో రాణించారు.పల్నాడు ప్రాంతానికి చెందిన చింతపల్లి రామారావు త్వరలో బిజేపి లో MLA గా కేంద్ర క్యాబినెట్ పెద్దల అండదండలతో టికెట్ హామీ సాధించారని సమాచారం.



# తూనీగ పాండే

బాలీవుడ్ నటవారసురాళ్లలో అనన్య పాండే ప్రత్యేకత గురించి తెలిసిందే. నేటి జనరేషన్ లో స్పీడ్ ఉన్న ఫ్యాషనిస్టాగా ఇప్పటికే యూత్ గుండెల్లో నిలిచింది. లుక్ పరంగా ఈ భామ నిరంతర ప్రయోగాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. తాజాగా అనన్య తూనీగ వేషం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల ప్యారిస్ లో ర్యాంప్ పై నడిచిన అనన్య ఒక ప్రత్యేకమైన డిజైనర్ లుక్ తో షాక్ వేవ్స్ పంపింది. ఒక అందమైన తూనీగ తన ఎద అందాలను కప్పి ఉంచే ఆ దృశ్యం ఎంతో ముగ్ధ మనోహరంగా కనిపించింది. ఎంపిక చేసుకున్న డిజైన్ యూనిక్ నెస్ తో కట్టి పడేసింది. ఈ డ్రెస్ ని రూపొందించినది ప్రముఖ బాలీవుడ్ ఫ్యాషన్ డిజైనర్ రాహుల్ మిశ్రా. దీనికి స్ఫూర్తి క్రిమి కీటకాలు అని అతడు వెల్లడించాడు. - సిద్ధిక బటన్ లెస్ ఫోజులు వైరల్ అనన్య తాజాగా తన పారిస్ ట్రిప్ నుంచి కొన్ని అద్భుతమైన ఫోటోలు, వీడియోను షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. అనన్య దీనికి అందమైన క్యాప్షన్ ని కూడా ఇచ్చింది. "ఇది అలాంటి క్షణం! పారిస్ కోచర్ వీక్‌లో రాహుల్ మిశ్రా కోసం వాకింగ్" అంటూ సీతాకోక చిలుక, ఫ్లై, తూనీగ సహా ఇతర కీటకాల ఈమోజీలను షేర్ చేసింది. మన పర్యావరణంలోని కీటకాలు సరీసృపాలతో జీవితాన్ని పంచుకోవడంలోని ఆనందం వేరు. అందరి దృష్టిని ఆకర్షించే సూపర్‌హీరోస్ (క్రిమి కీటకాలు) సేకరణ వెనుక ఉన్న ఆలోచన నాకు బాగా నచ్చింది. గ్రహం మీద మన జీవితాలను నిర్మించుకునే ప్రయత్నంలో కీటకాల ఆవాసాలను స్వాధీనం చేసుకుని వాటిని అంతరించిపోయేలా మానవాళి చేసి ఉండవచ్చు" అని వ్యాఖ్యానించింది పాండే గాళ్.

# తెలుగు రాష్ట్రాల్లో 200కి పైగా థియేటర్లలో హలో బేబి



హలో బేబీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్‌లో ఉత్తమ చిత్రం అవార్డును గెలుచుకుంది. నిర్మాత కాండ్రేగుల ఆదినారాయణ, ఏడు పూర్వ చిత్రాలతో, ఇటీవల ఈ అవార్డు గెలుచుకున్న చిత్రాన్ని రూపొందించారు. దీనిని తిరుపతిలో సత్కరించారు మరియు ప్రముఖ నటి నందిత శ్వేత సమర్పించారు. HELLO BABY పేరుతో రూపొందిన ఈ చిత్రానికి SKML మోషన్ పిక్చర్స్ రూపొందించిన కథాంశం, దీనికి రామ్ గోపాల్ రత్నం దర్శకత్వం వహించగా, సినిమాటోగ్రఫీ రమణ కె నాయుడు, సంగీతం: సుకుమార్ పమ్మి, ఎడిటింగ్ సాయిరామ్ తాటిపల్లి. ముఖ్యంగా, ఇది కావ్య కీర్తి పోషించిన సోలో క్యారెక్టర్‌తో మొదటి హ్యాకింగ్ చిత్రం. తెలుగు రాష్ట్రాల్లో 200కి పైగా థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేసిన మేకర్స్ హిందీలో కూడా రీమేక్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా విజయవంతంగా షూటింగ్ పూర్తి చేసుకుని యు/ఎ సెన్సార్ రేటింగ్ అందుకుంది. ఇండస్ట్రీలో తొలి హ్యాకింగ్ చిత్రంగా సెన్సార్ అధికారులు ప్రశంసలు కురిపించారు. నిర్మాతలు సినిమా నిర్మాణ సమయంలో వారి ప్రారంభ అంచనాలకు అనుగుణంగా అదనపు అవార్డులను ఆశించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.